# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204741
UNIVERSAL LIBRARY

# OSMANIA UNIVERSITY LIBRARY

all No. T 9.21 Accession No. T 3968

ıthor J21G

le [illegible]
గద్దె, లక్ష్మీనరసింహ శాస్త్రి

This book should be returned on or before the date
t marked below.

స గ్రంథ 40

# జడభరతుడు


కావ్యతీర్థ
శ్రీ గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి
సాహితీ సమితి



సాధన గ్రంథ మండలి, తెనాలి.

సర్వస్వామ్య సంకలితము
మొదటికూర్పు - 1952

వెల - పండ్రెండణాలు

నందన వసంతము

★

జానకీరాం ప్రెస్, తెనాలి.

# మనవి

సాధన గ్రంథ మండలి కీ "జడభరతుడు" అను గ్రంథముతో నైదు సంవత్సరములు పూర్తియైనవి. మండలికి తగిన ఆర్థిక సాధన సంపత్తి యేమియు లేదు. ఈ కారణముచే నేటికి పదియారు వందలు ఋణగ్రస్తమైనది. ఐనను తన ధర్మమును తా నిర్వర్తించుచు, ఎట్టి ఉత్తమగ్రంథముల వెలువరించుచున్నదియు పాఠకలోకమునకే విదితము. పోషకవర్గము, ఇతరులు సముచితసాదరాభిమానములు చూపవలెను. మండలి స్వయముగ నిట్లు విన్నవించుకొనుచున్నందులకు పాఠకలోక మన్యథా భావించరాదు. కొన్ని సంవత్సరములుగా, మండలికి తా మివ్వవలసిన పారితోషికముల వెంటనే యిప్పించి, మండలిని అభివృద్ధికి తీసికొనివచ్చి, ఉత్తమ గ్రంథముల పాఠకలోకమున కందించునటుల తోడ్పడగలందులకు వినయముతో ప్రార్థించుచుంటిమి.

ఇట్టి ఉత్తమసంస్థలను, అభివృద్ధికి తెచ్చి లోకోపకారకమగు సేవను చేయించుటయె మానవ ధర్మమని తలంపుడు. కనీసము సభ్యులుగా, లేక అభిమానులుగ తామెల్లరు జేరి సంపూర్ణ సహాకారమిచ్చిన అఖండమగు కృషి చేయగలదు—రాబోవు గ్రంథము — శ్రీ మధుసూధన సరస్వతీ విరచితమగు "భక్తిరసాయనము".

నందన
చైత్రము

వ్యవస్థాపకుడు
బులుసు సూర్యప్రకాశశాస్త్రి

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| అవతారిక | ... | 5 |
| ప్రియవ్రత వృత్తాంతము | ... | 9 |
| ఆగ్నీధ్ర చరిత్రము | ... | 12 |
| నాభి వృత్తాంతము | ... | 13 |
| ఋషభ దేవానుచరితము | ... | 15 |
| కుమారాను శిక్షణము | ... | 17 |
| భరతుని రాజ్య పాలనము | ... | 25 |
| తపోవన గమనము | ... | 26 |
| మృగ పోషణము | ... | 27 |
| మృగశరీర ప్రాప్తి | ... | 32 |
| జడభరత స్థితి | ... | 33 |
| కేదార గోపనము | ... | 35 |
| శిబికావహనము | ... | 38 |
| రహూగణోపదేశము | ... | 47 |
| భవాటవీ వర్ణనము | ... | 49 |
| ఉపసంహారము | ... | 55 |

# జడభరతుడు

## అవతారిక

"చలార్ణవయుగీ మధ్య కూర్మగ్రీవా ప్రవేశవత్,
అనేక జన్మనా మన్తే వివేకీ జాయతే పుమాః."

జ్ఞానవాసిష్ఠము.

అనంత మహార్ణవమున నొకదానినొకటి యొరసి కొనుచు భయంకరములై పాఱుచున్న రెండు తరంగముల నడుమ, ముందుకు సాగిపోనెంచి వచ్చి చిక్కిన కూర్మము, అటు నిటు పోనేరక, తరంగ మహాఘాతములకు నొచ్చి, డస్సి, తూలి, విహ్వాలమై, అనంతకాల మచ్చట నే పడియుండి యుండి, అదృష్టవశమున నవకాశము చిక్కినపుడు, మెల్లగా తనమెడ యెత్తి ముంగలితరంగమున జొనిపి, పురోగామియై, తలచిన చోటికి పోవును. అట్లే సంసారసాగరమున బడి వేనవేలేండ్లు దుఃఖపరంపరలలో జిక్కి చిక్కి దరిగానక పడియుండి యుండి అనేకజన్మములు గడచినవెనుక పురుషుడు పరపురుషుని యనుగ్రహమున వివేకమును బడయ నేర్చును.

**"ఉద్ధరే దాత్మ నాత్మానం; నాత్మాన మవసాదయేత్;**
**ఆత్మైవ హ్యాత్మనో బన్ధుః రాత్మైవ రిపు రాత్మనః."**

శ్రీమద్భగవద్గీత.

"ఉదయించిన వివేకధనమును బుద్ధిమంతుడు వ్యర్థము గానీయరాదు. అతిశ్రద్ధాదరణము గావించుకొనవలెను. అంతియ గాని, మందభాగ్యులై, ఆత్మనాశనమునకు గడగి, ఆత్మహత్యా మహాపాతకమునకు ఒడిగట్టరాదు."

ప్రతివాడును తాను బాగుపడుటకుగాని, చెడిపోవుటకు గాని, తానే కారణ మగుచున్నాడు. తనను బాగుచేయగల వాడితరుడుగాని, చెఱుపగల యితరుడుగాని, వేఱొకడుండడు. కర్తవ్యాకర్తవ్యములయందు ప్రవర్తించి, తత్ఫలములను గుఱి యగుటకు ప్రతిమానవుడును తనకు దానే కారణ మగును. అందు దానికి స్వతంత్రుడుగాని, పరతంత్రుడు గాడు. కావున తనకు దానే బంధువు, తనకు దానే శత్రువు నగుచున్నాడు.

దేహేంద్రియ సంఘాతమును స్వాధీనము చేసికొన నేర్చినవాడు, జ్ఞానమును బడసి, పరమార్థమును జూఱగొనును. దేహేంద్రియసంఘాతమునకు సర్వాత్మనా వశపడినవాడు అనర్థమును బొందును.

దేహేంద్రియసంఘాతమును గెలిచి, జ్ఞానియై, నిర్మలమగు నంతఃకరణముతో భగవత్పరాయణుడగువాడు, ద్వంద్వములకు గుఱి గాడు. శాస్త్రజ్ఞానముతో, అనుభవజ్ఞానముతో తృప్తమై పరమార్థపరాయణమైన యంతఃకరణముతో

జితేంద్రియుడై, ఆతడు మంటిబెడ్డను, బంగారమును, ఒకటిగా చూచుచు, సమదృష్టితో, నిర్వికారుడై, చిత్తసమాధానము గలిగి చిన్మూర్తియై యుండును. అట్టివానిని యోగి యందురు. వానిదృష్టిలో, శత్రువులు, మిత్రులు, తనవారు, పరాయివారు, ద్వేష్యులు, అనుకంప్యులు, సాధులు, అసాధులు, పాపులు, పుణ్యులు అను విచార ముండదు. ఆతడు సమదర్శి. అనగా సర్వభూతములయందును, బ్రహ్మదర్శనము చేయువాడు. బ్రహ్మ కంటె వేఱైనది ఆతని దృష్టిలో లేదు. అట్టియోగి ఉత్తమోత్తముడు.

చిత్తమును లోగొనిన అట్టి యోగి, వివిక్తసేవియై సంగముగ దూరుడై, పవిత్రమగు స్థలమున అనువగు నాసనము సమకూర్చుకొని ఏకాగ్రమైన మనస్సుతో, ఇతర మెఱుగక బ్రహ్మ పరాయణుడై యుండును. అపుడాతడు, నివాతదీపమువలె తరంగములులేని సముద్రమువలె, అచంచలుడై, పరమశాంతుడై, యుండును.

ఔషధముద్వారా శరీరరుగ్మతలువలె, యోగాభ్యాసమున మనోరుగ్మతలు వదలి, ఆతడు క్రమముగా దృష్టాదృష్ట విషయ తృష్ణ లడగి, నిర్వాణపరమమైన పరమశాంతిని పొందును. అదియే మోక్షము.

కాని చంచలమై శరీరేంద్రియవిక్షేపకరమై, బలీయమైన మనస్సును నియమించుట అంత తేలిక కాదు. మహోగ్రలయ ప్రచండ వాయువువలె దాని నరికట్టుట అలవిగాని పని,

అయినను అభ్యాసముచేతను, వైరాగ్యముచేతను క్రమముగా మనస్సును నిగ్రహింపవచ్చును. యతి కది సాధ్యపడక తప్పదు. అట్లు అభ్యాసవైరాగ్యములతో మనస్సును లోగొనని వానికి పూర్వోక్తయోగము సిద్ధింపదు. స్వాభావికమైన చాంచల్యము తటి వేచి, సందు దొరకినపుడు వానిని ప్రాపంచిక వ్యవహారమునకు మరల్చుచుండును. కావున మోక్షేచ్ఛువైన యోగి, మనస్సును సర్వథా లోగొనవలయును.

యతమానుడయ్యు సంపూర్ణముగ మనస్సు స్వాధీనము కాని యోగి, యోగభ్రష్టుడు కాక తప్పదు. కాని, అంతమాత్రమున వాని కిహమునందుగాని, పరమునందుగాని వినాశము సంభవింపదు.

**"న హి కల్యాణకృ త్కశ్చి ద్దుర్గతిం తాత! గచ్ఛతి"**

**భగవద్గీత.**

మంచి చేసినవా డెవడును, ఎన్నడును చెడడుగదా!

అట్టి యోగభ్రష్టుడు, పుణ్యములు చేసినవారు పడయు లోకములను బడసి అనేకసంవత్సరము లక్కడ వసించి, తిరిగి శ్రీమంతుల యిండ్లలోనో, మహాయోగుల యిండ్లలోనో, పవిత్రములైన స్థలములయందు జన్మించును.

ఇందొక విశేషము గలదు.—"ఒకానొక సుకృతవశమున శ్రీమంతులయిండ్లలో జన్మ నెవ్వరైనను బడయవచ్చునుగాని, జ్ఞానధనులై, సదాచారసంపన్నులైన యోగులయిండ్లలో జన్మ, యోగము నభ్యసించినవానికిగాని లభింపదు.

అచ్చట జన్మించుటతో నాతని పని పూర్తి కాలేదు. పూర్వాభ్యాసవశమున నాతడు మరల యోగాభ్యాసమునకు గడగి, శుద్ధుడై, అనేకజన్మసంసిద్ధుడై పరమమైన బ్రహ్మనిర్వాణమును బొందును.

అట్టి యోగి తాపసులకంటెను, జ్ఞానులకంటెను, కర్మనిష్ఠులకంటెను, శ్రేష్ఠుడుగా పరిగణింపబడుచున్నాడు." — అను గీతాయోగసారమునకు లక్ష్యభూతుడయిన మహానీయుడే భరతరాజర్షి.

భరతుడు అట్లు యోగారూఢుడై, సంగమువలన భ్రష్టుడయి, సదాచారసంపన్నమగు యోగికులమున జన్మించి, మరల యోగాభ్యాసవశమున మహాయోగియై, బ్రహ్మోపదేశమున లోకమును తరింపజేసి, స్వయముగా బ్రహ్మీభూతుడైన మహానీయుడు.

సముడు, సర్వభూతమయుడు అయిన ఆ మహాయోగి చరిత్రము అభ్యాసపరులకు తారకముగదా!

## ప్రియవ్రత వృత్తాంతము

పరమ భాగవత ప్రియవ్రతుడగు ప్రియవ్రతుని తండ్రియగు మనువుచే బ్రహ్మోనులయనుమతిని, రాజ్యమున నభిషేకింపబడి, అఖిల జగదంధ ధ్వంసనకరానుభావుడగు నాదిదేవుని యడుగుతామరపూల ననవరత మర్చించుచు, పరిరంధిత కషా

యాశయమున నవదాతుఁడై, యావన్మహీమండల పరిపాలనమున నిమగ్నుఁ డయ్యెను.

అతఁడు, విశ్వకర్మకొమరిత యగు బర్హిష్మతిని పెండ్లియాడి, పదిమంది కొడుకులను, ఊర్జస్వతి యను కడగొట్టు కూతును గనెను. ఆ పదుగురును, ఆగ్నీధ్ర, ఇధ్మజిహ్వ, యజ్ఞబాహు, మహావీర, హిరణ్యరేత, ఘృతపృష్ఠ, సవన, మేధాతిథి, వీతిహోత్ర, కవి, నామములతో నొప్పారి, గుణ శీల రూప కర్మ వీర్యౌదార్య ప్రధానముల దండ్రికి దగిన కొడుకులుగా వెలసిరి. వారిలో కవి, మహావీరుఁడు, సవనుఁడు అనువారు ముప్వురును, ఊర్ధ్వరేతస్కులై పారమహంస్యాశ్రమమును గొని, ఆత్మవిద్యానిష్ణాతులై, శ్రీవాసుదేవ పదారవిందావిరత స్మరణానుభావమున భవబంధము వదలి బ్రహ్మీభూతులైరి.

మఱొకభార్యయందు ప్రియవ్రతునకు ఉత్తముఁడు, తామసుఁడు, రైవతుఁడు అను ముప్వురు కొడుకులు కలిగిరి. వారు ముప్వురును మన్వంతరాధిపతు లయిరి.

ఇట్లు ఉపశమసంపన్నులగు కొడుకులతో సద్వితీయుఁడై ప్రియవ్రతుఁడు, ఎదిరిలేని మగంటిమి నుద్దండముగా ఏకాదశ కోట్యర్బుద పరివత్సరములు అఖండ భూమండల పాలన ధౌరంధర్యమున నెసలారెను. తన రాజ్యమున రాత్రి యనున దెన్నఁడు గలుగఁగూడదను పట్టుదలతో భగవదుపాసనోచితాతి పురుష ప్రభావ వైభవుఁడగు ప్రియవ్రతుఁడు సూర్యరథముతో సమాన వేగము గల జ్యోతిర్మయ రథమున నధివసించి, ఎక్కడ ఏ నిమి

షమున జూచినను తానుగా సూర్యునిచుట్టు జ్యోతిర్మూర్తియై క్షణమున కేడుమాఱులు పరిక్రమించెను. ఆ సమయమున నాతని రథచక్రధారాఘాతములచే నేల పగిలి, ఛటువాటి, సప్తసింధువులు, తదంతరములలో సప్తద్వీపములు నేర్పడెను. క్షారోదము, ఇక్షురసోదము, సురోదము, ఘృతోదము, క్షీరోదము, దధిమంథోదము, శుద్ధోదము నని ఆ యేడుసంద్రములకు సస్వార్థనామము లేర్పడెను. జంబూద్వీపము, ప్లక్షద్వీపము, శాల్మలిద్వీపము, కుశద్వీపము, క్రౌంచద్వీపము, శాకద్వీపము, పుష్కరద్వీపము నని యా సప్తద్వీపము లాయాచిహ్నములను బట్టి ప్రసిద్ధనామముల నొందెను. ఈ యేడు సముద్రములు క్రమముగా నేడు ద్వీపములను చుట్టి విస్తారమున నభ్యంతర ద్వీపసమానములై యనూనము లయ్యెను.

ప్రియవ్రతుడును, జంబ్వాది సప్తద్వీపములను క్రమముగా దన యేడుగురు కొడుకులకు బంచియిచ్చి తగు శిక్షణమున వారల తత్పాలనమున నియమించెను. ముద్దుల కూతురగు నూర్జస్వతిని ఆ రాజచంద్రుడు భార్గవున కిచ్చి పెండ్లి చేసెను. ఆమెకూతురే దేవయాని.

ఇట్లు కొమరులయందు రాజ్యభారమునిడి ప్రియవ్రతుడు విరక్తుడై నారదాశ్రమమున కరిగి, తదుపదేశమున యోగమున నిలిచి, పరదేవతా ప్రసాదాధిగత దివ్యానుభావవిశేషమున ధన్యుడయ్యెను.

# ఆగ్నీధ్ర చరిత్రము

ప్రియవ్రతుడు బ్రహ్మసాయుజ్యమును బడసినపిమ్మట, జ్యేష్ఠపుత్రు డగు ఆగ్నీధ్రుడు, రాజ్యభారమును వహించి, జంబూద్వీపవాసులగు ప్రజలను, బిడ్డలనువలె జూచుచు, ధర్మపురస్సరముగ నేలెను.

ఆగ్నీధ్రు డొకపరి, పితృలోకమున కేగ గోరి, సురసుందరీ క్రీడామందిరమగు మందరగిరికయి, తదేకనిష్ఠతో ప్రజాపతి నర్చించెను. బ్రహ్మయు నవ్వాని తెఱ గెఱిగి, సభలో మధురముగ గానము సేయుచున్న పూర్వచిత్తి యను నప్సరసను పంపెను.

పూర్వచిత్తి, ఆగ్నీధ్రాశ్రమోపాంతమున సులలిత గతివిన్యాసాదు లుట్టిపడ, మూర్తీభవించిన రతివోలె, మోహనవిగ్రహయై విహరించుచుండెను. ఆమెకాలియందెల ఝళంఝళధ్వని చెవులకు సోకి, ఆగ్నీధ్రరాజకుమారుడు నియతి సాలించి యటనుండి లేచి, ప్రోల ననతిదూరమున మధుకరాంగనవోలె, విరిపూవుతావి నాఘ్రాణించుచున్న పూర్వచిత్తిం జూచి, యామెయందచందములకు, జవ్వనపు పసందునకును వశంపడి, మదనునిచేతి కీలుబొమ్మ యయి, జడునివోలె, నామెను బలుకరించి నన్ను పరిగ్రహించి యేలుకొ మ్మని వేడెను.

పూర్వచిత్తియు వాని బుద్ధి రూప శీల వయ శ్శ్రీ సంపదలకు ముగ్ధయై వల్లె యని యాగ్నీధ్రుని బతిగా గొనెను.

వారిరువురు గాఢానురాగమున నొక యరనిముసమేని యొండొరుల బాయనేరక పెక్కువేలేండ్లు వివిధభోగముల ననుభవించిరి. వారికి నాభి, కింపురుష, హరివర్ష, ఇలావృత, రమ్యక, హిరణ్మయ, కురు, భద్రాశ్వ, కేతుమాల, సంజ్ఞకు లగు తొమ్మండ్రు కొడుకులు గలిగిరి. కొడుకులు గలిగినవెంటనే పూర్వచిత్తి యిక భూలోకమున నుండనొల్లక మరల నిజలోకమున కరిగెను.

ఆగ్నీధ్రుడు ఆత్మతుల్యులగు నాత్మజులకు జంబూద్వీపమును నవవర్షములుగ భాగించి వారలకు బంచియిచ్చి, పూర్వచిత్తి నెడసి నిలువనేరక దినదినము నామెనే తలపోయుచు వేదోక్తమార్గముల దల్లోకమున కరిగెను.

మాతృనుగ్రహమున పుట్టువుతోడనే మహాబల పరాక్రమ ప్రభావాతిశయముల నద్వితీయులై యీ రాజకుమారులు తొమ్మండ్రును క్రమముగా మేరుదుహితలగు మేరుదేవి, ప్రతిరూప, ఉగ్రదంష్ట్రి, లత, రమ్య, శ్యామ, నారి, భద్ర, దేవి, యను వారల బరిణయమాడి జంబూద్వీపవర్షముల దొమ్మిదింటిని ధర్మమార్గమున నేలిరి.

## నాభి వృత్తాంతము

నాభి, చిరకాలము సంతానము గలుగమి, వగచి, పుత్రముడై, మేరుదేవితో భగవంతు నారాధించెను. ఆతని నిష్ఠకు కరగి, సర్వప్రియు డగు భగవానుడు, దర్శన మొసగి,

నీకు కొడుకునుగా నేనె అవతరింపగల నని వర మిచ్చి యంతర్ధి బడసెను.

అనంతర మనతికాలమున కమలనాభుడు, నాభిప్రియ చికీర్షువై, మేరుదేవియందు, వాతరశనులు, మహాతపస్వులు, నైష్ఠికబ్రహ్మచారులు నగు నవధూతల పరమధర్మములను లోకమున బ్రకటించు తలంపున, శుద్ధసత్త్వమయమగు నాకారముతో నవతరించెను.

పుట్టువుతోడనే అభివ్యక్తము లగుచున్న భగవల్లక్షణములతో సామ్య, ఉపశమ, వైరాగ్య, ఐశ్వర్య, మహావిభూతి విశేషములతో దినదిన ప్రవర్ధమానానుభావు డగు నారాజకుమారుని గని, మహాపురుషునిగా నెంచి, ప్రజలును, బ్రాహ్మణులును, తమ యేలిక యగుట కాతడే తగినవా డని యాశంసించిరి. తండ్రియగు నాభియు, మహాపురుషలక్షణ లక్షితు డగు నాతనికి ఋషభుడు అని పేరిడెను. ఋషభుడు అనగా సర్వశ్రేష్ఠుడు అని అర్థము.

ఋషభకుమారుని యనితరవైభవములను జూచి కన్నుగుట్టి యింద్రు డొకపరి వర్షింపక బిగిసెను. అది గని ఋషభుడు కానిమ్మని నవ్వుచు ఆత్మయోగమాయా విలాసమున అజనాభము అను తనవర్షమున నాయాతరుణములలో వలసినంత వర్షించి, ప్రజలకు మేలు గూర్చెను.

నాభిమహారాజు, తన కోరికకు మించిన కుమారుని గన్న యానందమున దన కత్యంతము కృతార్థత నెంచి మొదలు

మఱచుచు, తరుణమున ఋషభుని రాజ్యపాలనమున నభిషేకించి, వానికి బాసటగా వేదవిద్వరులగు బ్రాహ్మణశ్రేష్ఠుల నియమించి, మహాదేవితో బదరికాశ్రమమున కరిగి, యనుపమ తపస్సమాధియోగమున నరనారాయణమూర్తి నారాధించి జీవన్ముక్తుడయ్యెను.

## ఋషభదేవానుచరితము

ఋషభదేవుడు, గురుకులవాసమున నుభయవిధమగు వేదధర్మము ననుశిక్షింపబడి, తదనుమతిని గృహమేధి ధర్మములను లెస్సగా నెఱపుచు, దన యజనాభవర్షము కర్మక్షేత్రమగుట విధివిహితకర్మములు యథావిధి జరుపుచు, జయంతి యను తన యనుగునిల్లాలియందు నూర్గురు కొడుకులను బడసెను.

వారిలో భరతుడు జ్యేష్ఠుడు. అతడొక శ్రేష్ఠుడే గాదు; మహాయోగిపుంగవుడు. భరతుని పరిపాలనమునుండియే యజనాభవర్షమునకు భారతవర్షమని పేరు వచ్చినది. భగవదంశావతారమై పుణ్యపురుషుడగు భరతరాజర్షి పాదపరాగములచే పవిత్రమైన యీ భరతవర్షమున, మనము జన్మించి, తత్పవిత్రశేషములగు నదీజలములను ద్రావి, మనగలుగుటచే, మనమును ఇంతదనుక నీపాటి గౌరవమున ధన్యులమని చెప్పుకొన గలుగుచున్నాము.

తక్కిన తొంబదితొమ్మండుగురిలో కుశావర్తుడు, ఇలావర్తుడు, బ్రహ్మావర్తుడు, ఆర్యావర్తుడు, మలయకేతువు, భద్రసేనుడు, ఇంద్రస్పృక్కు, విదర్భుడు, కీకటుడు, అనువారు తొమ్మిదిమంది ముఖ్యులు. కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, ద్రమిళుడు, చమసుడు, కరభాజనుడు, అనువారు తొమ్మిదిమంది భాగవతధర్మదర్శనులై మహాభాగవతశ్రేష్ఠు లయిరి. తక్కిన యెనుబదియొక్కరు పిత్రాదేశపరాయణులై, శుద్ధసత్త్వగుణసంపన్నులు, మహాశ్రోత్రియులు, యజ్ఞశీలురు, కర్మవిశుద్ధులు నగు బ్రాహ్మణులుగా నిలిచిరి.

ఇట్లు ఋషభదేవుడు సాక్షాద్భగవానుడే యయ్యు, తదితరులవలె, కర్మలనారంభించి కాలానుగతమైన ధర్మమును ఆచారముద్వారా లోకమున కుపశిక్షించుచు, గృహమేధియై సుప్రజార్థములైన భోగములను భోగించెను. ఉత్తము డాచరించిన దానినే తక్కినలోక మనుసరించుట సహజముగదా! స్వయముగా సమస్తధర్మములను తా నెఱిగియుండియు ఋషభదేవుడు వేదవేత్తలైన బ్రాహ్మణుల నడిగి తెలిసికొని వారి యాదేశమున నట్లాచరించి, లోకము ననుశిక్షించెను. ఆతడు వేలకొలది యజ్ఞములను జేసెను. ఋషభదేవ పరిరక్షితమైన యజనాభమున నేజీవియు కోరినదానిని బడయకుండుట యనున దెన్నడు నెఱుగదు.

ఋషభదేవుడు రాజ్యమును కొడుకులకు బంచియిచ్చి విరక్తుడై, దేశమున సంచరించుచు, నొకానొకపుడు బ్రహ్మ

వర్త్మమున బ్రహ్మర్షులు పలువురున్న నిండుసభలో, ప్రజలెల్లరు వినుచుండ, సహజ వినయ ప్రశ్రయ ప్రణయ భర సుయంత్రితు లగు తన పుత్రులం గని లోకశిక్షణమునకై యిట్లుపదేశించెను.

## కుమారానుశిక్షణము

"కుమారులారా! శరీరధారుల కీ శరీరము, దుఃఖకారణములై, తుచ్ఛములైన కామముల ననుభవించుట కేర్పడినది కాదు. శుద్ధసత్త్వ మగు తపోయోగమున ననంతబ్రహ్మ సుఖమును సాధించుట కిది పరమసాధనము.

మహాత్ములసేవ మోక్షమునకును, యోషిత్సంగిసంగము బంధమునకును, ద్వారములు.

సర్వభూతమైత్రితో క్రోధాదివికారములకు దూరమైన ప్రసన్నచిత్తము గలిగిన సాధుమూర్తులు మహాత్ము లనబడుదురు. వారు పరమేశ్వరుడ నైన నాయందు గాఢస్నేహము నలవరచుకొని దారపుత్రాదులయందును గేహంభరవ్యాపార పరులైన జనులయందును దవ్వులువడక, నిష్కించనులై లోకమున సంచరించుచుందురు.

అజ్ఞానవశమున బడి, దేహ, యింద్రియప్రీతికోసమై చేయరాని పాపములు చేయుచుందురు. అది యెంతమాత్రమును తగదు. అద్దానివలన క్లేశభూయిష్ఠమైన జన్మపరంపర కలుగును.

ప్రారబ్ధవశమున ననంతములగు జన్మపరంపరలలో బడి మునుగుచు తేలుచు నుండు దేహి, ఆత్మతత్త్వమును దెలిసి కొనునంతవఱకును అట్లే పుట్టుచు చచ్చుచు జఘన్యస్థితికి బోవుటయేగాక, అజ్ఞానవశమున నాయా కర్మలలో దవులువడి యుండును. కర్మములయం దభిరుచి యెక్కువయై యట్టివి యాచరించినకొలది మనస్సు కర్మాత్మకమే యగును. తద్ద్వారా శరీరబంధము తప్పనిసరి యగును. ఇట్లు మనస్సు కర్మవశమై యజ్ఞానవశమున దత్ఫలములయందు దవులువడి, వాసుదేవుడనైన నాయందు ప్రీతి కలుగునంతదనుక దేహి దేహయోగమున నుండి ముక్తుడు గాజాలడు.

దేహి వివేకము గలిగి, ఇంద్రియాదివ్యాపారము మిథ్యయనియు, ఆత్మసంబంధి కాదనియు, నెఱిగికొన వలయును. అట్లెఱిగికొననంతవఱకు నాతడు, ఆత్మస్వరూపజ్ఞాన మడగి, అజ్ఞుడై మిథునభావమున సుఖములు బ్రదర్శించు గృహబంధములలో బడి, అంతు లేని తాపములతో తపించిపోవును.

స్త్రీపురుషుల మిథునీభావము వాస్తవమునకు సుఖమయమైనది గాదు. అది రెండొరులను గట్టివైచి యడచియుంచు హృదయగ్రంథి మాత్రమే. బలీయమైన ఆ హృదయగ్రంథి ద్వారా, దేహేంద్రియాదులయందు, అహం మమ రూప మగు మహామోహము జనించును. కావున గృహాదులు మహామోహ నిర్వాహకములైన లోహజాలములు గాని వేఱొండు గాదు.

అట్లు కర్మాభిరతిద్వారా యేర్పడి దృఢమై మనోమయమైన హృదయగ్రంథి సడలిపోయిననాడు, జను డీమిథునీభావము

నుండి నివర్తించి, తద్ధేతుకమైన అహంకారము నడచివైచికొని, ముక్తుడై, పరమపదమును బడయును. హృదయగ్రంథి శిథిలమై పోవుట కిరువదియైదు సాధనములు, పండితులచే నుపదేశింపబడినవి. అవి యేవి యన—

1 పరమహంసనై, జగద్గురువునైన నాయందు భక్తి. 2 మదనువృత్తి. 3 వితృష్ణ. 4 ద్వంద్వసహనము. 5 సర్వత్ర దుఃఖానుసంధానము. 6 జిజ్ఞాస. 7 తపస్సు. 8 కామ్యకర్మ త్యాగము. 9 మదర్థములైన కర్మల నాచరించుట. 10 నాకథల యందే తవిలి యుండుట. 11 మత్పరాయణులైన మహాత్ముల తోడి సంగము. 12 నాగుణములనే కీర్తించుచుండుట. 13 సర్వభూతమైత్రితో సమదర్శనమున మెలగుట. 14 దేహ గేహాత్మబుద్ధిత్యాగము. 15 అధ్యాత్మయోగము. 16 వివిక్త సేవనము. 17 ప్రాణేంద్రియాత్మాభిజయము. 18 సచ్ఛ్రద్ధ. 19 బ్రహ్మచర్యము. 20 అసంప్రమాదము అనగా కర్తవ్యమును విడువకుండుట. 21 వాఙ్నియమము. 22 సర్వత్ర మద్భావన. 23 అనుభవపర్యంతమైన జ్ఞానము. 24 యోగము. 25 ధృతి, ప్రయత్నము, సత్త్వము గలిగియుండుట. ఈ ఇరువదియైదు సాధనములతో క్రమముగా దేహి, అహంకారోపాధిని రూపుమాపుకొనవలయును. ఇట్లు అవిద్యాపాదితమై కర్మాశయమైన హృదయగ్రంథిని, యోగముద్వారా పోగొట్టుకొని, యాపిమ్మట సాధనభూతమైన యోగమునుకూడ విడువవలయును.

పుత్రులను తండ్రిగాని, శిష్యులను గురువుగాని, ప్రజలను రాజుగాని, నాయనుగ్రహమున నాలోకమును బడయనోపు వాడు విమన్యువై పరమశాంతస్వభావమున పైతీరుననే యుపదేశించి, కర్మమూఢులైన వారలను తరింపజేయ వలయును. అంతియగాని అజ్ఞులై అనుకంప్యులైన వారలకు కర్మమును బోధించి సంసారకూపమున బడద్రోయరాదు. పాపము! దీనులగు అజ్ఞులకు అట్లు కర్మల నుపదేశించి సంసారకూపమున బడద్రోయువా డేమి బావుకొనగలడు? వాడు పొందగల పురుషార్థ మేది? నష్టదృష్టియై గ్రుడ్డితనమున బోయి పెద్ద గోతిలో పడనున్నవాని నట్లె పడద్రోసి యెవ డేమి లాభమును బడయును? అవిద్యాంధకారమున మునిగి స్వసుఖలేశమునకై యితరులను వంచించి, ద్వేషించి, సాధించువాని నట్లు ప్రవర్తింపజేసిన ప్రయోజనమేమి? తప్పుత్రోవన బోవువానిని, బుద్ధిమంతుడు వాని శ్రేయస్సుగోరి, సరియైన త్రోవకు మరల్పవలయును. త్రోవ దప్పిన గ్రుడ్డివాని నట్లె పొమ్మని చెప్పి, మహాగర్తమున బడ జూడరాదు. అట్లు చేసినవా డెవడైన బాగుపడునా? భయంకరమై పైబడనున్న మృత్యువును తప్పించుకొను నుపాయము నుపదేశింపని గురువు, గురువుకాడు; బంధువు, బంధువు కాడు; తండ్రి, తండ్రి కాడు; తల్లి, తల్లి కాదు; దైవము, దైవము కాదు; పతి, పతి గాడు.

కుమారులారా! మీరు నా నిజవృత్తాంతము నెఱుంగగోరితిరా? నేను ప్రాకృతమనుష్యుడను కాను. వాసుదేవ పరబ్రహ్మమునకును నాకును భేదము లేదు. ఈ నా మనుష్య

స్వరూపము, నాయిచ్ఛ ననుసరించి యేర్పడినది. ధర్మవిలసితమైన నా హృదయము శుద్ధసత్త్వమయము. అధర్మములను దూరీకరించి, ధర్మములను నిలుపుటకు నే నవతరించితిని. అట్లే చేసితిని. అందువలననే నాకు, ఋషభుడు అను నన్వర్థనామము గలిగినది. మీరో, శుద్ధసత్త్వమయమైన నాహృదయమునుండి ఆవిర్భవించిన మూర్తులు. కావున, సర్వథా నాతో సమానులై, నాప్రతికృతియై, శ్రేష్ఠగుణుడై, జ్యేష్ఠుడైన భరతుని, మీరు పరమాత్మబుద్ధ్యా సేవింపుడు. ఈర్ష్యా ద్వేషముల కెన్నడును మనసును గుఱి గానీకుడు.

కుమారులారా! మఱొక రహస్యమును వినుడు. ప్రపంచము భూతమయముగదా! వివిధభూతములలో స్థావరములు గొప్పవి. వానికంటె జంగమములు గొప్పవి. వానిలో జ్ఞానము గలవి గొప్పవి. వానిలో మనుష్యులు గొప్పవారు. వారికంటె ప్రమథులు; వారికంటె గంధర్వులు; వారికంటె సిద్ధులు; వారికంటె కిన్నరులు; వారికంటె సురలు; వారికంటె అసురలు; వారికంటె దేవతలు గొప్పవారు. వారిలో ఇంద్రుడు శ్రేష్ఠుడు. వానికంటె బ్రహ్మసుతులైన దక్షాదు లధికులు. వారిలో భవుడు సర్వోత్తముడు. వానికంటె విరించి ముఖ్యుడు. ఆతడు మత్పరాయణు డగుట వానికంటె నే నధికుడను. నేనో, బ్రాహ్మణపరాయణుడను. నాకు ద్విజ దేవు లనవరతము పూజ్యులు. కావున వారు నాకంటె నుత్తములు. ఇంక బ్రాహ్మణులతో నుపమింప దగు వస్తువు నే నెంచను గాన. బ్రాహ్మణాగ్నియందు హుతమైన అన్నాదిహవ్యమునువలె, సాక్షాదగ్ని

యందు హుతమైన హవ్యమును నేనంత ప్రీతిగా గొనను. సనాతనమై పరమపవిత్రమైన నా వేదమయ స్వరూపమును ధరించువారలు బ్రాహ్మణులుగదా! అంతియగాక, వారు సత్త్వాద్యష్టగుణములకు నిధానములు.

స్వర్గాపవర్గాధిపతినై, పరముడనై, అనంతుడనై, శ్రీ వాసుదేవ పరబ్రహ్మమూర్తి నగు నాయందనితరంభక్తిభావమును, నకించనులై మెలగు శుద్ధసత్త్వ మూర్తులకు నాకంటె మఱింకేదియు నవసరము లేదు. అది వారిదృష్టిలో నేమియు గాదు. కావున, కుమారులారా! స్థావర జంగమాత్మకము లగు సర్వభూతములు మదధిష్ఠానములు గావున, పరమ పవిత్రాంతఃకరణమున, నిర్మత్సరదృష్టితో, వానిని పదేపదే సమ్మానించుచు నుండుడు. అదియే సర్వాత్మనా మత్పూజ. అదియే మత్ప్రసాదమునకు దారి.

అది లేనిచో దురంతమై, మహామోహమయమైన కృతాంతపాశమునుండి జనుడు విముక్తుడగుట కల్ల.”

అని, లోకానుశాసనముకొఱకై ఋషభదేవుడు, స్వయముగా ననుశిక్షితులగు కుమారుల కుపదేశించి, పరమ భాగవతుడు, భగవజ్జనపరాయణుడు నగు భరతుని రాజ్యపాలనమున నియమించి, ఉపశమశీలురు, ఉపరతకర్ములు నగు మహామునులకు భక్తి జ్ఞాన వైరాగ్య లక్షణమైన పారమహంస్య ధర్మము ఆచారపూర్వకముగా నుపదేశింప దలచి, విరక్తుడై ఉన్మత్తునివలె, దిగంబరుడై, జడలు విరియబోసి, ఆహవ

సీయాగ్నిని దనయం దారోపించుకొని బ్రహ్మావర్తమునుండి పరమహంసయై వెడలిపోయెను.

జడాంధ బధిర మూక పిశాచోన్మాద చేష్టల మెలగుచు, ఎవరేని బలుకరించినను బలుకక, ఋషభుడు ఆత్మానుసంధానమున గాలివలె నెల్లెడ నవ్యాహతగతితో సంచరించుచుండెను. అచటనచట పుర వన గ్రామాదికములలో ఏనుగును దోమలు వలె, మూఢులగు జనులు పరిభవించినను, కొట్టినను, తిట్టినను, రాలు రువ్వినను, ఏమి చేసినను లెక్కింపక, మిథ్యాభూతమైన దేహమున నభిమానము లేక ఆత్మారాముడై, అసంగుడై, భూమండలమున బరిభ్రమించుచుండెను.

అట్టిచో, అతిసుకుమారములైన కర చరణా ద్యవయవముల సహజ సౌందర్యమున, స్వాభావ మధురమై నిగూఢస్మిత వదన మహోత్సవమున పురవనితల కనుదమ్ములకు పండువై వారి హృదయములలో కామదేవు నుపపాదించుచు, పరాగభర ధూసరమై, జటిల కుటిలాలక కపిశ కేశభరమై, అవధూతమలినమైన నిజశరీరముతో ఋషభయోగి గ్రహగృహీతునివలె గన్పట్టుచుండెను. యోగమున కీ ప్రపంచవాతావరణము సాక్షాత్ప్రతిబంధి యనియు, దత్ప్రతిక్రియను గడగుట అంతకన్న నిందిత మనియు నెంచి, ఋషభయోగి, ఆజగరవ్రతమవలంబించి, పరుండియే తినును, త్రాగును, విణ్మూత్రములను విడుచును. కాని ఆయా వ్యాపారముల గుఱుతు లాతని హృదయమున లేవు. అది ఆత్మారామమై యుండెను. అట్టు

ఋషభయోగి విడిచిన పురీషసౌగంధ్యము పదామడలదూరము వ్యాపించి, లోకమునకు మహాత్మ్యము గూర్చుచుండెను. ఇట్లు గోమృగ కాక చర్యతో మెలగుచు నానాయోగచర్యా చరణుడై సాక్షాత్కైవల్యపతి ఋషభదేవుడు, తమ్ము గ్రహింపు మని వేడుచు వచ్చిన ఆకాశగమన, మనోజవ, అంతర్ధాన, పరకాయప్రవేశ, దూరగ్రహణ, దూరశ్రవణాది యోగసిద్ధుల నభినందించి గ్రహింప నొల్లక, త్రోసివేసెను.

ఇట్లవధూత వేష భాషా చరితములతో జగమునకు తన భగవత్ప్రభావ మెఱుక గానీక, లోకమున బరిభ్రమించుచు, ఋషభయోగి యొకతఱి, యదృచ్ఛావశమున దక్షిణ కర్ణాట దేశముల కరిగెను. అచట కుటకాచలోపవనమున గాలివాలున లేచి, యొకరాయి యాతని నోటిలో బడెను. దానిని లోనికి, వెలికి గానీక, పడినది పడినట్లే పెదవులనదుము నిలిపి, జడలు విరియబోసికొని, ఋషభయోగి ఉన్మత్తునివలె నయ్యరణ్యమున దిరుగుచుండెను. ఇంతలో నొకమూల దావానలము రేగి, యర ణ్యమును దగులబెట్టుచు, నిటునుండి యటు వ్యాపించి భయం కర మయ్యెను. దానితోబాటు ఋషభయోగియు నాత్మ జ్యోతిలో లీన మయ్యెను.

ఋషభదేవుని, వేషమును, ప్రవృత్తిని, విని దక్షిణ కర్ణాటాధిపతి, అర్హతు డనువాడు, అది యొక యుత్తమ వేషముగా నెంచి, ఆచరణలో బెట్టెను. వానినుండి ప్రవర్తిల్లి, అది యొక యాచారముగా, క్రమక్రమమున కలిదాక సాగి

వచ్చెను. ప్రకృతమున కలిలో, అజ్ఞానమోహితులై పశుప్రాయులైన మనుజులు, అన్నివర్ణములవారును, స్వస్వమర్యాదలు వీడి, శౌచ చారిత్ర విహీనులై, భ్రష్టులై, స్నానము, ఆచమనము, నెఱుగక, జుట్టు పెంచి, కత్తెర వేయించుచు, నష్టబుద్ధులై, బ్రహ్మ బ్రాహ్మణ యజ్ఞపురుష లోకవిదూషకు లగుచున్నారు. మిథునీభావమే వారి యానందమునకు పరమావధి. కుక్షింభరత్వమే నిత్యవిధి. ఇట్లు అవిద్యామూలమై, స్వేచ్ఛాకృతమైన లోకయాత్రతో పశుధర్మము నవలంబించి వర్తించు కలిజనుల భావిగతి, అంధతమఃకూపమున పతనముగాక వేఱొండా?

పతితులైన యిట్టి కలిజీవుల, కేకేని తారకము గల దన, పరమగురువైన ఋషభదేవుని విశుద్ధచరితమును శ్రద్ధగా ననుసంధానము చేయుటయే.

## భరతుని రాజ్యపాలనము

పరమభాగవతశ్రేష్ఠు డగు భరతుడు, అవనీతలపరిపాలనమున భగవత్సంకల్పితు డైనపిదప, విశ్వరూపునికుమార్తె యగు పంచజనిని పరిణయమాడి, ఆమెయందు, అహంకారము పంచ భూతసూక్ష్మలనువలె, అయిదుగురు కొడుకులను బడసెను. వారు క్రమముగా సుమతి, రాష్ట్రభృత్తు, సుదర్శనుడు, ఆచరణుడు, ధూమ్రకేతుడు అనువారలు.

బహువిద్వారు డగు భరతక్షితివరుడు, పితృపితామహులవలె, ధర్మమార్గమున నిలిచి, ప్రజలను స్వస్వకర్మలను దప్పనీక,

కన్నబిడ్డలనువలె పాలించెను. అనేకయజ్ఞములతో యజ్ఞపురుషు నారాధించి, తత్తత్క్రియాఫలమును బ్రహ్మార్పణముగ నెంచుచు, పరమేశ్వరబుద్ధితో, అధ్వర్యు దేవతాదికములను సమ్మానించెను.

## తపోవనగమనము

ఇట్లు కర్మవిశుద్ధితో, విశుద్ధ సత్త్వుడైన భరతుని హృదయారవిందమున శ్రీవాసుదేవపదారవిందములపై ననపాయమగు భక్తిభావ ముదయించి, నానాటి పెంపొంది యనంత మయ్యెను. అట్లు పెక్కువేలేండ్లు రాజ్యము చేసి, భరతుడు, తుదకు, పితృపైతామహమైన రాజ్యమును తన అయిదుగురు కొడుకులకు పంచి యిచ్చి, విరక్తుడై, పులహాశ్రమమున కరిగెను. అది అత్యంతము పుణ్యభూమి. అచట, నిజజనవాత్సల్యమున శ్రీహరి, ఇచ్ఛానురూపమైన రూపముతో నెడపక నిలిచియుండును. పులహాశ్రమమును చుట్టి గండకీనది, భగవత్స్వరూపములైన దృషచ్చక్రములతో, చక్రనది యను సన్నార్థనామమున బాఱుచుండును.

అచట భరతముని, అద్వితీయుడై, అద్వితీయమగు భక్తిభావమున, వివిధ కుసుమ కిసలయ తులసీ కాంబువులతో కందమూల ఫలోపహారములతో భగవదారాధన మొనర్చుచు, విషయాభిలాషము సంపూర్ణముగ వదలి, ఉపభృతమైన యుపశమమున నొప్పారెను. ఇట్లు నిజ రమణారుణ

చరణారవిందానుధ్యాన పరిచిత భక్తియోగవిశేషానందాను భవమున నితరప్రపంచమునే కాదు, తనయొడలు సయితము మఱచి, భరతముని, కనులు మూసి, నవ్వుచు, భాషించుచు, రోమాంచకంచుకితము లగు నవయవములతో కరకమలములతో నాచరించు భగవత్సపర్యను సయితము మఱచువాఁడు.

ఇట్లు, జింకతోలు వలువగా ధరించి, జడలు కట్టుకొని పోయి, అనుసవనస్నానార్ద్రములై, వంకరటింకరలై కపిశములైన శిరోజములతో రెండవ సూర్యుఁడువోలె వెలుఁగొందుచు, భరతతపస్వి, సూర్యమండలాంతర్వర్తి యగు హిరణ్మయపురుషుని, తల్లింగములైన సూక్తవాకములతో స్తుతించుచు నుండెను.

## మృగపోషణము

ఒకనాఁడు సంధ్యాసమయమున భరతరాజర్షి, గండకీ నదియందు స్నానమాడి, ప్రణవమును జపించుచు నట నిలిచి యుండెను. అత్తఱి గర్భ గుర్విణి యగు నొక హరిణి నీరు ద్రావ నేటికేతెంచి, త్రాగఁబోవుచుండెను. అదే సమయమున, నడవిలో ననతిదూరమున క్రొవ్విన సింగమొకటి దిక్కులు పిక్కటిల్లునట్లు గర్జించెను. అది విని హరిణి, సహజముగా భయము గలది యగుట మఱింత బెదరి వడఁకి, యచట నిలువ నేరక ఒక్కసారిగా ముందునకు దుమికి పోనెగరెను. అట్లు దుముకుచుండ, భయవశమున గర్భము స్రవించి, నీటఁబడెను.

హరిణియు వెంటనే స్మృహ తప్పి, యొక కటికరాతిపై బడి మరణించెను.

గిలగిల తన్నుకొనుచు నీట గొట్టుకొనిపోవుచున్న ఆ తల్లి లేని లేడిపిల్లను జూచి సహజదయామయుడగు భరతుడు, తన తపమును చాలించి, ఆపత్తు నొందిన బంధువునువలె దానిం గొనితెచ్చి, తన యాశ్రమమున గన్నతండ్రివలె పెంచదొడగెను. హరిణశుణకము సైతము ప్రాణదాతయగు భరతునిపై నెంతయు మచ్చికపడి, నిముసమేనియు వానిని వదలక, కన్నతండ్రిని పసిపాపడు వలె, చుట్టుకొని తిరుగుచు నుండెను.

ప్రారబ్ధవశమున నద్దానిపై గుదిరిన గాఢానురాగమున, తత్పోషణ ప్రీణన లాలనానుధ్యానములలో మునిగి, భరతర్షి, క్రమక్రమముగా తన జప తపో యోగ సమాధుల నన్నిటిని మఱచెను. ఇప్పుడు భరతున కవి యన్నియు ఏణకుణక పోషణమే! ఆ హరిణార్భకమే, వానికి ప్రాప్యమగు పరబ్రహ్మము.

భరతునకు జింకపిల్లపై ననురాగము నానాడు పెరిగి, పెలుకరాని దయ్యెను. దానిని చూచి యాత డెంతయు నానందమున పొంగిపోయెడివాడు.— "పాపము! ఈ చిన్ని జింకపిల్ల కాలచక్రవేగమున తనవారికి దూరమై, నాయండ జేరినది. నన్నే తండ్రిగా, తల్లిగా భావించుచు, తన లేత జాలిచూపులు నాపై నిడుకొని మిక్కిలి నమ్మికతో, మిక్కిలి మచ్చికతో, నన్నే చుట్టి తిరుగుచు, నితర మెఱుగకున్నది. కావున దయామతితో, అమితవాత్సల్యముతో నే నిద్దాని గాదని త్రోసివేయక పోషింప

వలయును. అన్యథా కృతఘ్నదోషమునకు గుఱి గావలసి యుండును. సహజదయామయులు, పరమశాంతులు నగు సాధువులు, సాధారణముగా నిట్టి కృపణపోషణ విషయమున గురుతరములైన స్వార్థములను సైతము లెక్కింపరు."— అని నిశ్చయించి, భరతుడు, ఆసన శయన స్నానాటనాదులయందు మృగార్భకమును బాయక, గాఢస్నేహానుబద్ధ హృదయమున మెలగసాగెను.

కుశ కుసుమ సమిత్పలాశ ఫల మూలోదకాముల గొనితే నడవికి బోవునపుడు ఆశ్రమమున నొంటిగ నదలి పో నిచ్చగింపక, హరిణార్భకమును సైతము వెంట గొని చనుచు, అడవి కుక్కలు, తోడేళ్లు మున్నగునవి యెక్కడ నపాయము గలిగించునో యను భయమున భరతుడద్దాని నెత్తుకొని మూపున నిడుకొని, ఱొమ్మున హత్తుకొని, చంకల నిఱికించుకొని, భుజముల మోచి, కడు జాగరూకతతో మరల నాశ్రమపదమునకు జేర్చి యూరట పొందువాడు. తన సమాధియోగమును సాగించుచు, నడుమనడుమ కనులెత్తి చూచి తనముంగల చెంగు చెంగున నెగిరి యాడుచు, వచ్చియు రాని చిన్ని చిన్ని కొమ్ములతో దన వీపు గోకుచు, అరగాలు చేతులు నాకుచు, కుశాసనమున దర్భలు చిన్నిముట్టెతో లాగి కొఱుకుచు దనపై దృష్టి నిడి ముంగల పరుండియు, యథేచ్ఛముగ తన ప్రాణబంధువు వలె తన్ను బాయక సుఖముగ కాలము గడపు నా హరిణకుణకమును జూచి, వాత్సల్యమున మనసు కరగి, కనుల దయా

సమ్మిశ్రిత ప్రేమాశ్రువులు నించుచు, భరతుడద్దానిమేను తన పాణిపుటమున నిమిరి పరమనిర్వృతి పొందుచుండెను.

దైవయోగమున నేనాడేని, క్రీడావశమున నది యొక క్షణము దూరమై, కనపడకపోయిన, నష్టద్రవిణుడువలె మిక్కిలి యుద్విగ్నుడై, తద్విరహము నోర్వక కృపణకృపణుడై, భరతర్షి సకరుణముగా, దీనాతిదీనముగా, వివశుడై, పరితపించుచు, నిట్లు తలపోయువాడు— “అక్కటా! తల్లి లేని యీ జింక పిల్ల యెటు పోయినది? ఏమైనది? ఘాతుకమృగములబారి బడక సుఖముగ నున్నదికదా? తల్లి గతించినప్పటి నుండియు, నాపై ప్రాణము లిడుకొని, నన్ను నమ్మి బ్రదుకుచున్నది. నేను నట్టి వాత్సల్యముతోనే పెంచుచుంటిని కాని, దాని విషయమై యేకృతఘ్నతకు బాలుపడలేదే? పాపము! దానికి నాపై నేమి కష్టము తోచినదో! లేకున్న నింతదనుక రాక, యెందుల కాలసించును? దైవమా! నా కట్టిభాగ్యము కూడనా? దైవకృపవలన క్షేమముగా నుండి, మరల ఆశ్రమోపవనమున చిన్ని చిన్ని పచ్చికపరకలు మేయుచు ఆహారిణ రాజకుమారుడు, నాకన్నులకు విందు గూర్చునా? ఎన్నడు? ఇంతదనుక లేదే? అదుగో, సూర్యు డస్తమింప నున్నాడు. అవిగో, ఘాతుక మృగముల గర్జలు. దేవతలారా! నా హరిణార్భకమును గాపాడుడు. అడవిజంతువుల కన్నుల కద్దాని గన్పడనీకుడు.

అయ్యో! ఇంకను నా హరిణకుణకము రాలేదే? ఇంతలో నది యేతేరి, విసధ రుచిర దర్శనీయ నిజ క్రీడా వినో

దములతో, నిర్భాగ్యుడ నగు నన్ను సంతసపెట్టునా? సమాధిలో నున్నపుడు నన్ను మెల్లమెల్లగ డాసి, ప్రేమసంరంభ విహ్వలమై కొమ్ములతో గోకి, కాళ్లపై పడి దొరలి, రాచుకొనుచు చుట్టు దిరిగి, కనులు విప్పి చూచి మేను నిమురుదనుక నూరకుండెడిది కాదు. హవిస్సు లుంచిన దర్భలపై పొరబాటున విణ్మూత్ర ములను వదలినపుడు, నేను కొంచె మలుక దెచ్చుకొని కసరగా, బెదరి, ఋషికుమారుడువలె ఒదిగి, అల్లన నించుక యెడసి కూర్చుండెడి, కన్నుల నీరు నించెడిది. ఆహా! ఈ వసుమతి యెట్టి పుణ్యము నాచరించుకొనినది? సవినయ కృష్ణసార తనయ తనుతర సుచిర మృదుల శివతర ఖుర పద పంక్తులతో, నష్ట ద్రవిణుడనైన నాకు ద్రవిణపదవిని సూచించుచు, సాలంకార యగు తనను, స్వర్గాపవర్గకాములైన ద్విజశ్రేష్ఠులకు, యజ్ఞ భూమినిగా నాచరించుకొను చున్నది.

ఓహో! ఆ చంద్రునిలో నగపడునది, నామృగా ర్భకమే! దురదృష్టవశమున నాశ్రమపదపరిభ్రష్టమై భయమున వడకుచు దిక్కులు చూచుచు నున్న యిద్దానిని, మృగరాజా దులబారి బడకుండ, తా గొనిపోయి, తనదరి నాశ్రయ మొసగి, ఆ శశధరుడు చల్లగ కాపాడుచున్నాడు కాబోలు! అవును. అది అట్లే అయియుండవలయును. ప్రియతనయ విరహ దవ దహన లీలా మాలికలలో బడి యుడికిపోవుచున్న నాపై జాలిపడి, యమృతకిరణుడు, శిశిర శాంతానురాగ గుణిత నిజ వదన సలిలామృతమయ గభస్తులతో నాకు శాంతిని

గూర్చ జూచుచున్నాఁడు! అదిసంభవమా? నామృగకుమారుఁడు నాదరి జేరనంతదనుక నాకు శాంతి యెక్కడిది ?"

ఇట్లు భరతుఁడు, మృగదారకాభాస మగు ప్రారబ్ధము నకు వశుడై నిరూఢమైన యోగమునుండి భ్రష్టుడై, తదాయత్తముగ వర్తించుచుండ, దురతిక్రమమైన కాలము, ఎలుక కన్నమును పామువలె సమీపించెను. అపుడును, హరిచింతనము లేక, మృగాయత్తచిత్తుడై, భరతుఁడు, తనదరి గూర్చుండి, తా బరచుకొనిన దర్భలు లాగుచు, కనుల నీరునించుచు దీనాతి దీనముగ జూచుచున్న మృగశిశువును జూచుచు, తన యనంతరము దీని గతి యేమగునా యని విచారించుచు, చేయున దేమియు లేక, కాలవశుడై యుసురు బాసెను.

## మృగశరీరప్రాప్తి

అంతకాలమున నెవ డేభావమును భావించునో, అత డాభావమునే పొందుట తథ్య మగుట, మృగదారకాభినివేశిత చిత్తుడై గతించిన భరతుఁడు, మఱుపుట్టువున, నొక లేడిగా పుట్టెను. కాని, భగవదారాధనానుభావ ఫలముగ పూర్వ జన్మస్మృతి బాయనికతమున, తనదుర్గతి నంతయు దలచి, భరతయోగి— "అహహా ! యోగపదవి నధివసించి, ఆత్మానత్పథమునుండి భ్రష్టుడ నైపోతినిగదా ! సమస్త సంగములు వదలి, వివిక్త మగు నరణ్యమే శరణ్యముగా జని, సర్వాత్మ యగు పరమాత్మ నారాధించుచు, ప్రారబ్ధవశమున మృగ

సంగమున దవిలి, యిట్టి దుర్గతి నొందితిని గదా? ఛీ!"— యని నిర్వేదమున లోలో వగచి, జనని యగు లేడిని, స్వయూథమును బాసి, జన్మస్థాన మగు కాలాంజనమునుండి బయలుదేరి పూర్వస్థాన మగు పులహాశ్రమమును జేరి, అందు నిరాహారముగ భగవదారాధనము సేయుచు, కృశించి, కృశించి, మృగశరీరమును విడిచెను.

## జడభరత స్థితి

అనంతరము భరతుడు, ప్రారబ్ధయోగమున, నాంగిరసుడను బ్రాహ్మణోత్తముని యింట, జనించెను. ఆంగిరసుడు ఆంగిరసగోత్రోద్భవుడు. శమ దమ తప స్స్వాధ్యాయాధ్యయనాధ్యాపన సంతోష తితిక్షా ప్రశ్రయ త్యాగ విద్యానసూయాత్మజ్ఞానానంద విలసితుడు. అతని కిరువురు భార్యలు. మొదటి భార్యయందు శ్రుత శీలాచార రూపౌదార్యాది గుణములతో తండ్రితో సమానులగు కొడుకులు తొమ్మండుగురు కలిగిరి. రెండవ భార్యయందు, ఒక కూతురు, ఒక కొడుకును గలిగిరి. ఆతడే యోగభ్రష్టుడైన భరతరాజర్షి. ఆపుట్టువునను వానికి భరతు డనియే ఆంగిరసుడు నామకరణ మొనర్చెను.

ఆపుట్టువున భరతుడు, తన ప్రారబ్ధమునకు తాను లోలో జింతించుచు, పతనహేతు వగు సంగమునకు వెఱచి, ప్రారబ్ధశేషానుభవమును గోరి, కర్మబంధ విధ్వంసన శ్రవణ స్మరణ గుణ వివరణ మగు భగవచ్చరణారవింద యుగళమును

హృదయారవిందమున నిడుకొని,యర్చించుచు,ఉన్మత్తుడువలె, జడుడువలె, మూఢుడువలె, స్తబ్ధుడువలె, బధిరుడువలె, అంధుడువలె, మూగివానివలె, ప్రవర్తించుచు, ఏ ప్రసక్తియు లేక యుండెను. అయినను అంగిరసుడు విడువక, కడగొట్టు కొడుకగుట గాఢస్నేహానియంత్రితుడై, సంస్కారలోపము రానీక, అన్నియు గావించి, ఉపనయనము చేసి, స్వయముగా వేదము నుపదేశించెను. కాని, ఎంతకును వాని కవి రుచించి, యుపయోగింపక, తనశ్రమ విఫల మగుటకు విచారించి అంగిరసుడు చేయున దేమియు లేక, యూరకుండియుండి, కాల వశమున కాలగతి నొందెను. ఆతని భార్యయు,తనసంతానమును, సవతికొడుకుల కప్పగించి, పతితోడిదే లోకముగ నరిగెను.

సవతిఅన్నలు, కేవల ప్రవృత్తిమార్గ నిరతు లగుట, ప్రాపంచిక వ్యవహార పరాఙ్ముఖుడై యంతర్ముఖు డగు భరతుని ప్రభావము నెఱుగనేరక, కసరి, కొట్టి, తిట్టి, పశువులవలె ప్రవర్తించుచు, ఓరీ జడుడా, మూఢుడా, బధిరుడా యని పిలిచి యేవగించుకొన సాగిరి. భరతుడు వా రెట్లు పిలిచిన నట్లు పలుకుచు, ఎట్లు చూచిన నట్లు కనఁబట్టుచు, తదనురూపము లగు కర్మలే యాచరించుచు, నేమి చేయించిన నది చేయుచు, పెట్టిన తినుచు, లేకున్న మానుచు, తా జేయువానిపై దృష్టిలేక, జడభరతు డన నన్వర్థనామమున ప్రారబ్ధశేషము ననుభవించు చుండెను. సవతిఅన్నలు వానికి,ఒక్కొక్కప్పుడు మితిమీఱియు, ఒక్కొక్కప్పుడు చాలీచాలనట్లు మిక్కిలి తక్కువగ, అన్నము, జొన్నలు, పిండి, తవుడు, తిలపిష్టము, ఊక, మొదలగునవి,

నీ కిది చాలు నె మ్మని పెట్టుచుండిరి. భరతుఁ డవ్వానిదృష్టి లేకయే, వారు పెట్టినది వారితృప్తికై తినుచుండెను.

ఇట్లు నిత్యనివృత్తుఁడై, నిర్మలానందమయుఁడై, ఆత్మారాముఁడైన జడభరతుఁడు, ద్వంద్వములను జయించి, శీతోష్ణ వాత వర్షములయందు నెప్పంచయేనియు లేక, కటికినేలపై పరుండి, బలిసిన దేహముతో, మహోక్షమువలె నిగూఢమగు సత్త్వమున మెఱయుచుండెను. ధూళిధూసరితమై స్నాన శౌచాదులకు దూరమైన యాతనిమేను, రజోవృతమైన మహామణివలె, అనభివ్యక్త బ్రహ్మవర్చస్కమై యుండెను. చినిగిన మురికి మొలగుడ్డ, తెగి, నల్లపడి, ప్రేలు జందెము, జూచి, లోకు లాతనిని భ్రష్టుడనియు, బ్రహ్మబంధు వనియు, నవమానింప సాగిరి. దోమ ఱెక్కలగాలికి మహావృక్షము చలించునా? భరతుఁ డవ్వారి కూతలకు కలఁగుటయేగాదు, చెవి వెట్టుటకూడ యెఱుఁగఁడు. ఆతని యాత్మానందమే యాతనిది!

## కేదారగోపనము

ఈ జడునితో నిక నింటిపనులు సాగవు; వీని నిచట నిలిపి యుంచిన యాహారముకూడ దండుగ; యని, యన్నలు వానిని చేనికాపుగ బంపిరి. భరతుఁడు — "మేలు; నా కదియే కావలెను; గృహబంధము వదలించిన మీకు జయమగుగాక —" యని వారిని లోలోనాశీర్వదించి, పొలమునకు బోయెను. కాని అచట చేనిపనియేమో, అది యేమగుచున్నదో, పక్షులు

కంటకులు దిని పోవుచున్నవో, అడవిజంతువులు పడి మేయు చున్నవో గమనింపక, మంచెపై వీరాసనమున గూర్చుండి, ఆత్మానుసంధానమున నోడలు మఱచి యుండువాఁడు. అన్నలు వచ్చి చూచి కొట్టినను, తిట్టినను కదలఁడు, మెదలఁడు. అచట నతని కనువగు నాహారము, నిజ రమణారుణ చరణ నలిన యుగల భక్తి మరంద రసమే.

ఆదరిదాపుల నడవిదొంగల మునాయకుఁ డొక డపత్యకాముఁ డయి, భద్రకాళికి, పురుషపశువు నిత్తు నని మ్రొక్కుకొనెను. కోరిక యీడేరిన వెనుక, యమభటులో యన దగు నాతనిభటు లెందే నొక యదృష్టవిహీనుని భద్రకాళికి పశువుగా గొనితెచ్చుచుండిరి. వాఁడును, చీకటి మఱుగున నెట్లో వారికంట బిడుకలు గొట్టి పలాయితుఁ డయ్యెను. కింకరులు క్రోధావేశమున, వానిని వెదకి వెదకి యెందును గానక, ప్రభుభయమున, కర్తవ్యము నారయుచు వచ్చుచుండిరి.

త్రోవలో, చేనిమొద్ద మంచెపై వీరాసనముపై నుండి, ప్రపంచభానము లేక, ఆత్మారాముఁడై యున్న, భరతుని జూచి, అమ్మా! బ్రదికితి మని వారు, వాని ఱెక్కలు విఱిచి కట్టి, నడువు మని బలవంతముగ నడిపించుకొనుచు, దమనాయకుని దరికి గొనిపోయిరి.

వృషలరాజపురోహితు లంత, సనభివ్యక్త నిజప్రభావుఁ డగు భరతుని, యథావిధి నభిషేకించి, బలివస్త్రాదికముల

నలంకరించి, మెడలో గన్నేరుదండలు వేసి, మేన రక్తచందనము బూసి, బలి కాయత్తపఱచిరి. గీత స్తుతి మృదంగ పణవఘోషణముతో, కాళిమ్రోల జేర్చిరి.

వృషలపతి, పురుషరక్తప్రవాహమున భద్రకాళికి మహోత్సవ మొనరింప సమకట్టి, అనువగు వేసమును సవదరించి, అభిమంత్రితమై మిఱుమిఱు మెఱయు చుఱకత్తిం గొని కాలకింకరుఁడువలె, పరమశాంతమూర్తి యగు భరత బ్రహ్మర్షి కుమారవరుని దరిసెను.

బ్రహ్మీభూతుఁడై, సాక్షాద్బ్రహ్మర్షి సుతుఁడై, నిర్వైరుఁడై, సర్వభూతసుహృత్తగు నయ్యోగిచంద్రుని దనకు బలి యొసఁగు నుద్యోగమున నున్న ధన మాన మద రజస్సముత్సిక్త మనస్కులై, రజస్తమఃప్రకృతులైన వృషలుల గాంచి, భరతుని బ్రహ్మతేజమున దనకొండలు భగభగ మండిపోఁ గడగ, నిక నట వృషలు లిడిన పీటపై నిలువ నేరక, భద్రకాళి, భయంకర మూర్తితో లేచి, మహాట్టహాస మొనరించుచు అమర్ష రోషావేశ రభస విలసిత భ్రుకుటీ విటప కుటిల దంష్ట్రాగ్రు శేతక్షుణాటోపాతి భయానక వదనయై, యెగసి, వృషలాధిపుని చేతి చుఱకత్తి యూడబెఱికి, వృషలులతలలు కందుకములుగా నెగసి పడ నఱికి, వారి క్రొత్తనెత్తురులలో, దన గణములతో బాటు వసంతము లాడి, యాడి, తృప్తి పడెను. మహాత్ముల కపచారము దలపెట్టినవారికి, ప్రతిఫల మిట్టిది గాక, వేఱొండెట్లు ఘటిల్లును ?

అట్టి మహాప్రళయ మట్లు లయ్యెడ దనవిషయమై జరుగుచున్నను, నది యావంతయు నెఱుకగ, విముక్త దేహా ద్యాత్మభావ సుదృఢ హృదయగ్రంథియై, యొకకొంత యయ్యెడ నటు నిలిచి, భరతయోగి, కాళికాలయము వెలియై, యథేచ్ఛముగ బోయెను.

## శిబికావహనము

సింధు సౌవీర దేశాధిపతి యగు రహూగణు డనువాడు, పాలకీ నెక్కి కపిలాశ్రమమునకు, తత్త్వోపదేశమును బడయ గోరి, పోవుచుండెను. శిబికావాహకులలో నొకడు, కడు బడలి, యది యొల్లక పాఱిపోయెను. తక్కిన బోయీలు, ప్రభువునాన తిని మఱొక బోయీని వెదకికొనుచుండిరి.

ఆసమయమున నిక్షుమతీనదీతీరమున నేకాకియై పోవు చున్న భరతుడు వారికంట బడెను. — "ఓహో! వీడు చియ్యబట్టి, బలిసి, ఆబోతువలె నున్నాడు, పడుచుగాడిదవలె నెంత బరువైనను మోయగలడు."—అని బోయీ లాతనిచేయి పట్టుకొని రమ్మని కొనిపోయి రహూగణునిశిబిక నాతని మూపుపై నిడి నడు మనిరి. భరతుడు, కిమ్మనక, శిబికాదండ మును దనచేత గొని జాగ్రతపడక, తనయిచ్చ వచ్చినట్లు నడువ దొడంగెను.

భరతునియడుగులును, తక్కిన బోయీల యడుగులును కలియుటలేదు. అత డొక కొంతదూరము చరచర, ఒకకొంత

దవ్వు మెల్లగ, మఱికొంత మేర పరుగుపరుగున బోవుచుండెను. ఆ విషమగతి, తక్కినవారలకు ప్రాణాంతక మగుటయేగాక, శిబిక క్షణక్షణము తలక్రిందులు కాసాగెను. లోని రహూగణు డూయెలలోవలె నటు నిటు నూగి, యట నుండునదియు నూడు నదియు దెలియక యట్టిట్టగుచుండెను.

అంత, రహూగణు డది యోర్వక, బోయీలం జూచి, కన్నుల నిప్పులు గురియుచు, నిట్లనెను— "ఓరీ! మీరు ప్రభువుపాలకీ యను మాట మఱచితిరా? తిన్నగా నడువుడు. లేనిచో, మీశరీరములు మీకు నిలుచు ననుట కల్ల."

అది విని వడవడ వడకుచు బోయీ లనిరి—"ప్రభూ! ఇది మా దోసము కాదు. ఇదుగో, ఈ క్రొత్తవాడు, క్రొవ్వున నొడలు మఱచి, తిన్నగా నడువకున్నాడు. వీనియొక నిమూలమున, సంఘమున కిట్టి దోషము సంభవించుచున్నది."

"రాజాజ్ఞగా మందలించుడు"— అని రహూగణుడు కఠోరముగ నానతిచ్చెను.

అట్లు హెచ్చరిక చేసి భరతుని నడువు మని, బోయీలు నడక సాగించిరి. బ్రహ్మపదాధిరూఢ మనోగతివిలాసుడైన భరతున కా నడకగుఱుతు లున్నవా? ఆత డెప్పటియట్ల, నడచుచుండెను.

మేనా మఱింత తల్లక్రిందు లయి రహూగణుని నేల పాలు గావించునటు లయ్యెను. ఇక నాత డోర్వక, వాలుగత్తి చేత గొని, పల్లకిలో నుండియే అంకెలు వేయుచు, నలుకతో,

అవిస్పష్టబ్రహ్మతేజమున, నివురు గప్పిన నిప్పువలె నున్న బ్రహ్మణ్యమూర్తిని భరతుని గని, సోత్ప్రాసముగ నిట్లనెను -

"ఓహో! తమ్ముఁడా! నీవా! పాపము! బక్క-చిక్కి, ఆఁబోతువలె నున్నావు. పైపెచ్చు ఇంతదూరము పల్లకీ కొమ్ము మూపున నిడికొని మోసి మోసి అలసి ఒప్పు చున్నావు. ఇంక నడువ మనిన నెట్లు, ఎంత నడువగలవు? అందును, నడికోడెప్రాయపు ముసలిగిత్తవు. వీరో, బలాఢ్యులు. వారితో నీవు తుల తూఁగి కాయకష్టమున నోర్వఁగలవా?"

అని విపరీతార్థము లగు వాక్కులతో నెంత యాక్షేపించినను కలఁగక, అవిద్యావిహిత ద్రవ్య గుణ కర్మాశయమును, సంస్థానవిశేషమును, మిథ్యయు నగు తన చరమకళేబరమున నభిమాన ముడిగి, అహంమమాదుల కెడసి, బ్రహ్మీభూతుఁడై యున్న భరతుఁడు, తూష్ణీంభావమున నెప్పటియట్ల మేనా మోచి నడచుచుండెను.

మరల శిబిక విషమ మగుట నైనఁ, రహూగణుఁడు కోప విష పూరిత రక్త నేత్రములతో చుఱచుఱ జూచుచు, భరతునితో ననెను— "ఓరీ! మూఢుడా! జీవన్మృతుడా! ప్రభువు నగు నా శాసనము మేరకు మీఱి, చరించుచుంటివా? నీ మద మడచి, పాపికి, దండపాణివలెనే, నేను నీకు తగిన శాస్తి చేయించెదగాక! అప్పుడుగాని, తల కెక్కిన నీకనులు క్రిందికి దిగవు."

నరదేహాభిమానియై, అట్లూరక వ్యర్థప్రలాపము లాడుచున్న రహూగణుని గని, భరతుఁ డల్లన నగుచు నిట్లనియె-

"రాజా! ప్రభువును; దండింతు నని యనుచున్నావా? ఇది మూఢులు పలుకుత్రోవ. విజ్ఞు లీమాటలను మెచ్చరు. శిబిక ఒకవేళ శరీరమునకు బరువయిన గావచ్చునుగాని, ఆత్మకు గాదు. బలుపు, తగ్గుదల, ఆధులు, వ్యాధులు, ఆకలి, దప్పిక, పడుచుదనము, ముసలితనము, నిద్ర, మెలకువ, రతి, క్రోధము, మదము, ఇవి యన్నియు దేహాభిమానము గలవానికి గలుగునుగాని, నిరభిమానియైనవానియందా సౌఖ్యములును పొసగనేరవు. జీవన్మృతత్వము, చావు పుట్టువులు గలదానికి గాని, నాకు ఘటిల్ల నేరదు.

స్వామి భృత్య సంబంధము దేహాదులకుగాని, ఆత్మకు గాదు. వాస్తవమున నేను స్వామిని, ఇతడు సేవకుడు, అను భేదబుద్ధి, అజ్ఞానకృత వ్యవహారముగాని, మఱొండు గాదు. మూఢుడవై, నీవట్టి అజ్ఞానవ్యవహారము నే గైకొని ప్రవర్తింప నెంతువో, అది నీయజ్ఞానవిలసితమైన నీ పూర్వాభ్యాసవిశేషము. అందుల కెవ రేమి చేయగలరు?

దండించువాడుగాని, దండింపబడువాడుగాని వాస్తవ మున లేరు. క్రోధవికారమునకు లోనై నీవొకవేళ, పిచ్చివాడు వలె, జడునివలె, అంధునివలె, బధిరునివలె, దేహాభిమాన రహితుడనై యున్న నన్ను దండింతువో, దానివలన గలుగు ప్రయోజనమేమి? స్తబ్ధునియందుపచరింపబడు శిక్ష, పిష్ట పేషణమే కదా?"

అని పలికి, నిగూఢసత్త్వుడై భరతయోగీంద్రుడు ఉప భోగముద్వారా ప్రారబ్ధము నపనయించుకొను తలపున రహూగణుని శిబిక నెప్పటియట్లు మోచికొని పోదొడగెను.

బహుయోగగ్రంథ సమ్మతమైన భరతయోగీంద్రుని వచనము, అమృతమువలె చెవికి సోకి, తత్త్వజిజ్ఞాస కధికృతుడై యున్న రహూగణు డబ్బురపడుచు, తత్క్షణమ శిబికనుండి దిగి, రాజాభిమాన ముడిగి, భరతునియడుగు లంటి, యిట్లు వేడెను–

"మహాత్మా! అంతస్సత్త్వులగు మీ ప్రభావము నెఱుగక, యి ట్లవినీతిగ బ్రవర్తించితిని. అజ్ఞుడను. క్షమింపుడు. సంగమును వదలి, గూఢుడవై తిరుగుచున్న నీ వెవరో యెఱుగ నేరకున్నాను. సూత్రధారణమాత్రమున బ్రాహ్మణుడ వని తలంచుచున్నాను. మహాత్మా! వజ్రాయుధమునకు గాని, అగ్న్యర్క సోమానిలాది తేజములకుగాని, బ్రహ్మాదులకు గాని, వెఱవను. బ్రహ్మకులావమాన మనిన నా శరీర మాపాద మస్తము కంపించిపోవుచున్నది. క్షమింపుడు. నా కులము నుద్ధరింపుడు.

నిగూఢ విజ్ఞాన వీర్యుడవై, జడుడువలె గ్రుమ్మరు చున్నావు. మీవాక్యములు యోగగ్రథితములు. మీ రెవరో, మీ వాస్తవవృత్తాంతమును నా కెఱిగించి ధన్యుని జేయుడు. నేను రహూగణు డనువాడను. జ్ఞానకలావతీర్ణుడు సాక్షాత్ శ్రీహరి యగు కపిలమహర్షియొద్ద జ్ఞానోపదేశమును బడయు టకై పోవుచున్నాను. నీవు లోకనిరీక్షణార్థ మొరుల యెఱుకకు

రాని తెలియగున నిగూఢప్రభావుడవై తిరుగుచున్న యా కపిల మహామునివే యవుదువేమో! మహాయోగుల చరిత్రమును, గృహాంధకూపములో బడి నష్టదృష్టు లగు వా రెవ రెఱుంగ గలుగుదురు ?

అయిన నొక సందియము : యుద్ధాదికర్మలవలన నాకు శ్రమ గలిగినట్లే నీకుమాత్రము శిబికావహనాదులవలన శ్రమ గలుగుటలేదా ? ఆత్మ యందఱకు నొక్కటియే గదా ? మఱి స్వామిభృత్యసంబంధాదికములు, వ్యవహారజన్యము లగుట యెట్లు ? ఘటాదులు లేక, నీరు దెచ్చుట మొదలగు పను లెట్లు జరుగును ? లేనివి గలుగ నేరవు గదా? కావున, ప్రమాణమూల మయిన లోకవ్యవహారము సత్యముగా శిష్టసమ్మతమే యగు నని తోచుచున్నది.

నిప్పుమంటలకు, వానిమీది భాండము తప్తమగును. తత్తాపమున, నందున్న జలము; దానికతన, జలములోని తండు లముల పైభాగము; తద్ద్వారా, తండులముల లోనిభాగము తప్తమై, అన్నము తయారగుచున్నది. అట్లే, అవయవములచేత చేయబడు కర్మల సుఖదుఃఖాదికము, దేహమునందును, తద్ద్వారా ప్రాణమునందును, తద్ద్వారా మనస్సునందును, క్రమముగా నారోపింపబడి, తత్ప్రారబ్ధవశమున, దేహబంధము సంభవించు చుండును. కావున, లోకవ్యవహారము, సప్రమాణమై నిత్య మగుచున్నది. మఱియు, ప్రజాపాలకుడైన రాజు, ధర్మనిరతుడై, భగవచ్చరణారవిందముల నాశ్రయించినచో పిష్టపేషణమున బడడు. వానికి భవము చూపుమాత్రమున నుండ నేరదు.

ఇంతకును, రాజు నను నభిమానమదమున, సమస్త భూతమిత్రుడవైన నిన్ను కాలులు కూసి మహాపచార మొనరించితిని. నిందాస్తుతులు మహాత్ముల కంటవు. అవి వారికి వికారమును గలిగింప నేరవు. అయినను, మహదవమాన దోషమున నెంతటి వాడును భ్రష్టుడు గాక తప్పదు. కావున, నన్ను క్షమింపుము."

రహూగణునిపలుకులు విని నవ్వుచు, భరతయోగి, వెండియు నిట్లనియె—

"రాజా! నీవు తెలిసినవాడవును గావు; తెలియనివాడవును గావు. అందువలననే వట్టి భ్రమకు లోనై, తెలిసినవాడ నను నహంభావమున నేమేమో చర్చించుచున్నావు. అదియు నొకింత మేలే. తెలిసికొనుట కైన నీకొకపాటి యధికారము గలిగినది. విజ్ఞులమతమును వివరించెద, వినుము—

విజ్ఞు లీ ప్రపంచమును తథ్య మనరు. మిథ్య యని వచింతురు. గృహ సంబంధము లగు యజ్ఞ యాగాదికములను బోధించు నామ్నాయవాదములందు, పరిశుద్ధమైన పరమార్థవాదము లేదు. హింసాశూన్యముగా, రాగాదిరహితముగా, నీశ్వరార్పణబుద్ధితో నొనర్పబడునది యొక్కటియే, పరమార్థప్రాప్తికి సాధనము. స్వప్నమున గలుగు సౌఖ్యము, తదాకారమున గలిగి యంతమున లేనియట్లు, వేదాంతవాక్యములును, తత్త్వజ్ఞానోదయమునకు సాధనముగా, యజ్ఞాది కర్మములను బోధించి, తలగునేగాని, నిత్యములై యుండ నేరవు.

పురుషుని చిత్తము సత్త్వమునకుగాని, రజమునకుగాని, తమమునకుగాని, వశమైయుండునంతదనుక జ్ఞానేంద్రియ కర్మేంద్రియములద్వారా ధర్మాధర్మములను గలిగించుచు నుండును. అట్లు ధర్మాధర్మవాసనా యుక్తమైన మనస్సు విషయానువిద్ధమై గుణప్రవాహమున బడి, చాంచల్యము నొంది, కామాది వికారములకు లోనయి, దేవ తిర్యఙ్మనుష్యాది దేహముల బుట్టించుచుండును. అందది కాలప్రాప్తములైన సుఖదుఃఖ మిశ్ర ఫలముల ననుభవించుచు, అంతులేని సంసారచక్ర రూపమున జీవునియందు బ్రతిఫలించుచు, స్థూల సూక్ష్మ రూపముల నుండును. కావుననే మనస్సును, గుణాగుణాత్మములకు కారణముగ నందువుదురు.

మనస్సు గుణసహితమై సంసారమును, గుణరహితమై ముక్తిని, గలిగించును. దీపము ఘృతవర్తులతో గలిసి సధూమ శిఖల గల్పించుచు, ఘృతవస్తులు నశించిన పిమ్మట స్వస్థితిని బొందునుగదా! ఇట్లె మనస్సు, గుణకర్మానుబద్ధమై సంసారమును బుట్టించును; గుణకర్మరహితమై ముక్తికారణ మగును.

జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, అహం, మమ, అను వృత్తుల గూడిన మనము, జీవునికి జన్మపరంపర నవిచ్ఛిన్నముగ గలిగించుచుండును. వృత్తిరహితమైన మనస్సు పరిశుద్ధమై, జీవుని, సర్వభూతాంతర్యామియై పరంజ్యోతి యగు నారాయణపరబ్రహ్మమున నేకము గావించును. జీవుడు, మాయావరణమున బడి, జ్ఞానోదయము నొందనంతదనుక,

ముక్తసంగుఁడు గాఁడు; సంసారమున బడి యుండును. కామాద్యరిషడ్వర్గములను జయించి, జ్ఞానధనమును గడించినవెనుక, మహైశ్వర్యము నొందును. కావున నెంతటివాఁడైనను, పరమశత్రువగు మనస్సు నుపేక్షింపక, శ్రీహరిచరణోపాసనాస్త్రమున జయించి, పరతత్త్వమును బడయవలెను."

అని విని, రహూగణుఁడు, ఆతనిమహిమకు వెఱగుపడి, కరకమలములు ముకుళించి యిట్లని వినుతించెను—

"మహాత్మా! మీరు కారణవిగ్రహులు. మాదృశమూఢలోకమును తరింపజేయ నిట్లు అవధూతవేషమున దిరుగుచున్న భగవానులు. ఎఱుగక మీయెడల నేనొనరించిన తప్పు సైరింపుఁడు. ఎండలో మాడి దప్పిగొనినవానికి, చల్లని మంచినీరువలె, సంసారతాపతప్తుఁడనైన నాకు, మీ వచనము దివ్యామృతమువలె తాపహారమైనది. మీపలుకులు అధ్యాత్మయోగగ్రథితములై, నాకు దురవగాహములుగా నున్నవి. కావున, శిష్యుఁడను, ప్రపన్నుఁడను నగు నన్ను కరుణించి, విపులముగ, వివరించి, తత్త్వము నుపదేశింపుడు.

ప్రత్యక్షాదిమూలకమైన క్రియాఫలము, వ్యవహారమూలముగాని, సత్యముగాదనిన మీ యుపదేశము నాకంతగా బోధపడలేదు. నా సందియము దొలగునట్లు బోధింపుఁడు. ఈ నా యజ్ఞానాంధకారమును బోగొట్టి జ్ఞానజ్యోతిని వెలిగింప మీరే సమర్థులు."

నావృడు, భరతుడు— "రాజా! తత్త్వమును దెలిసికొనుటకు నీవిపు డధికారివై యున్నావు. అట్లే చెప్పెదగాక. సావధానముగ విని, యనుభవమున నిడుకొని, పరతత్త్వసాక్షాత్కారమును బడయుము—" అని బోధింప దొడగెను.

## రహూగణోపదేశము

"జనుడు అని చెప్పబడు నీ దేహము పృథివీవికారమే గదా! భూతములలో నిది చలనవిశిష్టము. చలన మాగిననా డది జడమేగదా! అంతును నొక విశేషము విచారింపుము. భూమిపై కాళ్లు, వానిపై పిక్కలు, వానిపై తొడలు, వానిపై నడుము, దానిపై ఉదరము, దానిపై రొమ్ము, దానిపై కంఠము, అట దారువు, ఆ దారువున శిబిక, అందు నీవు, రాజను నభిమానముతో నుండి, పార్థివవికారములైన దేహములచే మోయించుచు, మూఢులగు నవాగ్వరల హింసించుచుంటివిగదా! నిజముగా నీ యన్ని శరీరములకును నీకును భేదమేమి? నీ రాజాభిమాన మదమేగదా యింతులకు గతము? దేహాభిమాన మదాంధ్యమున నష్టదృష్టివై యసత్యములు పలుకుచున్న నీవు ఆత్మవేత్తలయెదుట నెంచుకు గొఱగానివాడవు కావా?

భుజముపై నిడుకొనిన శిబిక భార మగునేని, ఉత్తరోత్తరావయవములు, పూర్వపూర్వావయవములకు బరువు కావలయునుగదా? అది నీ యనుభవమున నెన్నడేని యున్నచో

దెలుపుము. రెండును పార్థివములే, రెండును ఆద్యంత వంతములే, యపుట, నధిన్నుడును గాజాలడు.

సర్వంసహ యగు భూమికిని, తనపై దిరుగు నీ పార్థివ దేహములు భారములు కావు. భూమికిని ఆద్యంతములు గలవు. అది స్వకారణములగు భూతసూక్ష్మములలో విలయమొందును. పరమాణువులు, అవిద్య నాధారముగ జేసికొని వాదులచే కల్పింపబడినవి. అవిద్య భగవన్మాయావిలసితము. కావున, అవిద్యా మనఃకల్పితమై, కృశ స్థూల బృహ దణు సదస జ్జీవాజీవ ద్రవ్య స్వభావాశయ కాల నామకమైన మాయచేత యీ జగత్తు కల్పింపబడి, రెండవదిగా భాసించుచున్నది. ఇది యంతయు, అనులోమ విలోమక్రమమున నశించిపోవునదియే.

ఎల్లెడ నిండియుండి, పరిశుద్ధమై, స్వప్రకాశమై, అఖండమై, అవికారమై, జ్ఞానస్వరూపమైన బ్రహ్మ మొక్కటియే సత్యము. ఐశ్వర్యాది షడ్గుణత్వ కారణమున నది భగవ చ్ఛబ్దవాచ్య మగుచున్నది. అదియే వాసుదేవ పరబ్రహ్మము.

అట్టి వాసుదేవ పరబ్రహ్మము, తపముచేగాని, దానముచే గాని, గృహధర్మములచేగాని, సోమ సూర్య గ్న్యాదులద్వారా గాని, పొందబడునది గాదు. మహ త్పాద పరాగ సేవ యొక్కటియే తత్ప్రాప్తికి పరమసాధనము.

భగవత్పరాయణుడైన ఉత్తమశ్లోకులసేవ, విడువక, అనుదినము చేయగా చేయగా, మనస్సు, గ్రామ్యకథలనుండి

మరలి, మోక్షమున కధికృతమై, భగవత్పాదారవిందములయందు బట్టువడును.

రహూగణా! నా కథ చెప్పెద వినుము. నేను పూర్వము భరతు డను రాజర్షిని. గృహమును వదలి ముక్తసంగుడనై వివిక్తస్థలమున భగదారాధనము సేయుచు, ప్రారబ్ధవశమున మృగసంగమున దవిలి, యోగభ్రష్టుడనై, అంతకాలమున దద్భావనతో మృగరూపమున బొడమితిని. అందు భగవదారాధనా ఫలముగ స్మృతి బాయమి, తదాసక్తమగు బుద్ధితో మేను వదలి, ప్రారబ్ధశేషానుభవముకు ఈ రూపు నొందితిని. అదియు నింతటితో దీఱినది. కావున ముముక్షువు, చంచలమగు మనస్సును అరికట్టి, సంగమును అసంగజాతమైన జ్ఞానాసితో ఛేదించి, శ్రీకృష్ణ పరబ్రహ్మా రాధనమున, సంసారమార్గమును తరింపవలయును."

## భవాటవీ వర్ణనము

వెండియు భరతుడు రహూగణున కి ట్లనియె—

"మాయానియంత్రితుడై దాట రాని ప్రవృత్తిమార్గమున బడద్రోయబడిన జీవుడు, రజ స్సత్త్వ తమో విభక్తములైన కర్మలయందు దగిలి, సుఖ దుఃఖ మిశ్ర ఫలముల ననుభవించుచు, అధికఫల మపేక్షించి, ధనార్జనపరుడైన వ్యాపారివలె, భయంకరమైన సంసారాటవిం జేరును,

అందు, దుర్మార్గులైన కామాదులపేరిటి దొంగ లాఱుగు రాతనిని బట్టి, దర్శన స్పర్శన శ్రవణాస్వాద నావ ఘ్రాణ సంకల్ప వ్యవసాయ గృహ గ్రామ్యోపభోగమున నజితాత్ముడైన కునాయకునిధనమునువలె, కష్టించి సంపాదించి కొన్న భగవదారాధనరూపమైన, వాని ధర్మధనమును దోచి వేయుదురు.

అట్లు నష్టద్రవిణుడై పరమలుబ్ధుడుగా నయిన యా కుటుంబికుని, దార సుతాదులు, జంకపిల్లను తోడేళ్ళు నక్కలు వలె పట్టి, యిటు నటు లాగి విదలించివేయుదురు.

ఒకచో పెరిగి బలిష్ఠములైన తృణ గుల్మ లతాదులతో గహ్వరమైన గృహక్షేత్రమున బడి కర్మపరుడై తద్వ్యవసాయమున మునిగియున్న కుటుంబికుని, దుర్జనులపేరిటి మశకాదులు ముసరి కొఱికి వేయును.

గంధర్వపురమువలె అఘటమానమైన యీ విశ్వము నెల్ల జూచి, యిది వాస్తవముగా దలచి, ప్రాపంచిక వ్యవహారములలో బడి మ్రగ్గుచుండును.

ఒక్కచో అంధకార బంధురమైన యీ యడవిలో వెలుగుతో మహారయమున బరుగిడుచున్న బంగారముపేరిటి కొఱవిదయ్యమును జూచి, అది త్రోవ జూపి తన్నుద్ధరించు నను నాసతో నాతడు దాని నాసించి చని చని, యధఃపతితు డగును. అట్లరుగుచో నడుమ నడుమ స్త్రీపేరిటి సుడిగాలిలో బడి తదాసక్తమతియై భ్రమించి, తద్వ్యామోహముపేరిటి

మమ్మైన కనులు గానరాక, దిక్కుమొక్కెఱుగక కర్తవ్య విమూఢుడై దేవురులాడును.

అయ్యెడ పరోక్షముగా నప్రియము లాచరించి పలుకు వారలపేరిటి కీచురాళ్ళు, గ్రుడ్లగూబలు మున్నగువాని కూతల కులికి, చెవులు చిల్లులు పడ స్వస్థత దప్పి, కకవిక లగును.

అట్లు వ్యథితాంతఃకరణమున జనుచు, క్షుత్పిపాసార్దితుడై, అధార్మికులపేరిటి అపుణ్యవృక్షముల నాశ్రయించి, హతాశుడై నిర్ధనులపేరిటి మరీచికలలోని తోయములకు బరుగిడి, జలము లేమి మిక్కిలి డస్సి దైన్యమునుదూలుచు తూలి, నిరుదకములైన తద్వ్యాపార సరిత్తులలో విఱుగబడి గాత్ర భంగమున దుఃఖించును, గృహముపేరిటి దావాగ్నిలో బడి యుడుకును. అయ్యెడ, నిర్భాగ్యుడగు నవ్వాని నట్లు పడి యుండనీక, రాక్షసతుల్యులగు రాజులపేరిటి భూతములు పైబడి, ప్రాణతుల్యమగు ధనశేష మూడ్చివేయుదురు. ఇంకేమాత్ర మైన మిగిలియున్న దానిని స్వజనాదులు లాగివేయుదురు. వారి, తాకులకు, మోదులకు సైపనేరక, నష్టద్రవిణుడై, పాపమా జీవుడు పడు యాతన, రహూగణా! నోటితో బలుక దరము గానిది.

అంతలో గంధర్వనగరోపమమైన మనోరథోపగత పితృపుత్త్రాది సమాజమును జేరి, కొంకెంత యూరట పొందును.

ఏదియో మహాకార్యము చేయనెంచి విఘ్నాభిహతుడై కొండ నెక్కదలచినవాడు, కంటక పాషాణాదులవలన పాదపీడి

తుఁడై నేరకున్నట్లు, నడుమనే కుంటువడి, విమనస్కుఁడగుచు, అడుగడుగున భయంకరముగ లేచు ఆకలిపేరిటి కాఱుచిచ్చుల తెరలలో మలమల మాడిపోవుచు, మరల వెలి యగుచు, రక్షించువారు కన్పడమి, స్వజనులను బిలిచి, సాయపడమి, వారిని నిందించుచు, వందురుచు నుండును.

నడుమ నడుమ, రాత్రిపేరిటి కొండచిలువచే మ్రింగ బడుచు, తెల్లవారినపిదప దన్నిగీర్ణుఁడై, పూర్వముకంటెను భయంకరమైన సంసార మహార్ణవములో బడును. దీనాతి దీనుఁడైన సంసారికి, ఆరోజుకంటె ఆరోజు, మిక్కిలి క్లేశకరము గదా? అచట విషయములపేరిటి విషసర్పములచే గఱువబడి, య ట్టిట్టగుచు, నిలువలేక, పోయి, తృణలతాచ్ఛాదితమైన మోహముపేరిటి యంధకూపమున బడును.

ఒండొకచో, పరద్రవ్య పరవనితల పేరిటి తేనెపెరళ్ళు గని, వానిమీది లోభమున నపహరింప గోరి, చనును అపుడు తద్యజమానులపేరిటి అడవితేనెటీగ లది గుఱుతించి మేను పచ్చడి పచ్చడిగా చితుకగొట్టి వదలుదురు. ఆ బాధ కోర్వక మూర్ఛిలి చిర మటు పడియుండి, మరల సందు వెదకి, యెట్లో యొకకొంత తేనె సంపాదించి తెచ్చికొనును. కాని తనవలెనే, పరు లద్దానిని బలాత్కారముగా హరించివేయు దురు. అంతతో నష్టద్రవిణుఁడై, అవమానమున జిక్కి పురపుర బొక్కుచు, మరల తదార్జనమున కుద్యమించును.

ఒండొకచో, ఋతు లనబడు శీత వాత వర్షాదికము కోర్వక, తత్ప్రతిక్రియకు నేరక, సదమద మగుచుండును.

మఱియు సంసారి, ద్వంద్వవ్యవహారమున కాలము బుచ్చుచు, ధనముకొఱకై పరులను వంచించుచు నుండును. ఒక్క దమ్మిడీకొఱకై ద్వేషించి, యొరులపై గత్తులు నూరును. అందు సర్వస్వమును బోగొట్టుకొని శయ్యాసన స్థాన విహారాదులకు దూరమై, యా నిర్భాగ్యుడు పరద్రవ్యాపహరణ పరాయణుడై యుండును. అందులకు దానొకడే సమర్థుడుగాక, తనవంటివారల మఱికొందఱి గూర్చుకొని, తద్వ్యాపారమున బ్రవర్తించును. ఏ మంత్రమేని యాత్రోవ గడింపబడిన ధనముకొఱకు, వారు, అడవిలో సంపాదింపబడిన ఆమిషముకొఱకు లుబ్ధకులవలె, పరస్పరము పోరాడ చిక్కుల బడుచుందురు. దానితో వాని ధన మంతయు నడగిపోవును.

ఇవ్విధమున సంసారమార్గ సంచారులై మాయామోహితులైన జీవులు, అనర్థములైన అర్థములలో దవిలి, విహరించుచు ఇహలోకసుఖములను గోరి కర్మరతులై యుందురు గాని పునరావృత్తిరహితమైన మోక్షమును గోరి నివృత్తులు గారు. మఱికొంద ఱల్పులు, రాజాభిమాన మదమున కన్ను తెలియక దీనజనులను బాధించి శిక్షించుచు, భూమికొఱకై యుద్ధములు చేసి, అమాయికప్రజలను వేనవేలుగ జంపి, మూఢులై ఘోరనరకమున బడుదురు. అంతియేగాని, న్యస్తదండులై, నిర్వైరులై సర్వభూతహితరతులైన సంన్యాసులం గోరి పడయు పరమపదమును గలలోనైన నభిలషింపరు.

రహూగణా! సంసారమహాటవిం బడిన దుర్గతుని మోహవల్లతాభుజములు పెనవేసి గట్టిగా గట్టి పడవేయుచుండును.

వానినుండి వదలించుకొని బయటపడుట యిక నాతనికి చేత కాని పని. అందే పడియుండి యాతడు అపత్యములపేరిటి ద్విజకులముల అవ్యక్తపదము లాలించుచు, తద్భ్రంగగీతముల కలరుచు, తదాసక్తుడై, తత్పాలన పోషణ ప్రీణన లాలనాదుల యందు నిరతుడై, పడరాని యిడుమలు పడుచు నుండును. ఒండొకచో, దీర్ఘరయమున దిరిగి వచ్చు కాలముపేరిటి హరి చక్రధ్వనులకు గుండెలు దిగజారి, ఆత్మరక్షణకై క్రూరులగు పాషండులపేరిటి కాక కంక గృధ్ర బకాదులయండ జేరి, వంచితుడై, మరలి, హంసకులమును అనగా బ్రాహ్మణకులము నాశ్ర యించును. కాని వారలచే బ్రాయశ్చిత్తపూర్వకముగా శీలాదు లనుశిక్షింపబడి మరల సంస్కారముల నొంది ఋజుమార్గమున బడుట, శ్రమ యని, మొల్లక త్రోసివేసి, వానరజాతులతో గలిసి ద్వంద్వవ్యవహారమున గొమ్మలపై దవిలి, చిరము నిలిచి, కేవల వ్యవాయధర్మ నిరతుడై, చరించుచుండును. అపుడును రోగాదిరూపములైన గిరికందరములలో బడి,చిక్కొలి యార్తు డగుచు, మృత్యువుపేరిటి మహాగజమునకు వెఱచి, ప్రాచీన కర్మవల్లి నూతగా గొని నిలుచును. అట్లుండి యుండి యెట్లో యది గడచి మరల తన సార్థమున జేరి, మరల ధనార్జనకై భవాటవీమార్గమున బడుచుండును.

అంతియగాని, రహూగణా! మాయచే నీ సంసార మహారణ్యమున బడితుడైనవా డెన్నడును ముక్తిమార్గమును గొననేరడు.

కావున, రహూగణా! నీవును, మాయచే నిదే యరణ్యా
ుున బాలితుడవై యున్నావు. ఇప్పటికైనను దెలివి తెచ్చు
ని, పెద్దల యుపదేశమువలన గర్మబంధము నెడసి, సంగ
ును విడిచి, జితేంద్రియుడవై, శ్రీహరిచరణ సేవా సమా
దితమైన జ్ఞానాసిచే నజ్ఞానలతా పరంపరల రూపుమాపి,
ైన ముక్తిమార్గమున పరమపదమును బడయుము."

## ఉపసంహారము

అన విని, రహూగణుడు, ఉద్దీపించు జ్ఞానతేజమున
పలారుచు, పరమాహ్లాదమున నతిశయించి—"ఆహా! మానవ
న్మ మెంత ఉత్తమము? భగవత్పరాయణులై, నిగూఢ సత్త్వ
నమహనీయుల దర్శన స్పర్శనాలాప శ్రవణాభివందనాదులతో
ర్థక్యమును గడింప వీలగుచున్నది! మహాత్మా! ధన్యుడను.
జ్ఞానాంధకారమున మునిగి యున్న నాకు మీ యుపదేశము
ిటి సూర్యుడు దివ్యప్రకాశము నొసగినాడు. పిన్నలే కాదు,
ద్దలే కాదు, వృద్ధులే కాదు, తరుణులే కాదు, నిర్వైరులై
స్సంగులై, సర్వభూతమయులై, అవధూతలింగులై, లోకమున
ించుచుండు బ్రాహ్మణోత్తముల కందఱకును సమస్కరించు
న్నాను"— అని భరతుని జుట్టి సాష్టాంగ మాచరించి, తదా
ి జని, భగవదాయత్తచిత్తుడై, అగ్నిహోత్రముల నాత్మా
పణము గావించుకొని, దేహాత్మాభిమానమును వదలి,
రమపదసిద్ధి నొందెను.

భరతుడును, అటనుండి బయలుదేరి, భగవదాయత్త చిత్తమున ననవధూతయై యథేచ్ఛం జనెను.

యజ్ఞాయ ధర్మపతయే విధినైపుణాయ
యోగాయ సాంఖ్యశిరసే ప్రకృతీశ్వరాయ,
నారాయణాయ హరయే నమ ఇత్యుదారం
హాస్యన్ మృగత్వ మపి యస్సముదాజహార.

ఇదం భాగవతైః సభాజితావదాత గుణ కర్మణో రాజర్షే ర్భరతస్యానుచరితం, స్వస్త్యయన మాయుష్యం ధన్యం యశస్యం స్వర్గ్యాపవర్గ్యం, వానుశృణో త్యాఖ్యాస్య త్యభినందతి చ, సర్వా ఏవాశిష ఆత్మన ఆశాస్తే న కాంచన పరత ఇతి.

—శ్రీమద్భాగవతము. స్క. ౦. ౫.

ఇతి శ్రీః